# జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

జనం రిపోర్టర్ – జన శ్రేయస్సే మా బాధ్యత



విలేకరులు కావలెను

ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా నడపబడుతున్న జనం రిపోర్టర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు

ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాల్లో జిల్లాల వారిగా రిపోర్టర్లు కావలెను.

అంకిత భావంతో పనిచేసేందుకు ఆసక్తి గలవారు

సంప్రదించండి: 9398 15 6948



సంపుటి : 01 సంచిక : 220, ఎడిటర్: మార్పు సాయి కుమార్ పేజీలు : 08, వెల రూ. 5రూ/ గురువారం -05 - డిసెంబర్ - 2024

Published From, Srikakulam : Circulated at,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna,Kurnool , Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad


## ఆరు నెలల్లోనే ప్రభుత్వంపై ఇంత వ్యతిరేకత రావడం ఎప్పుడూ చూడలేదు: జగన్



2

- సూపర్ సిక్స్ లేదు.. సెవెన్ లేదని జగన్ ఎద్దేవా
- రాష్ట్రంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమైపోయాయని విమర్శ
- ప్రజల తరపున గళం విప్పాల్సిన సమయం వచ్చిందని వ్యాఖ్య

## కొణిజేటి రోశయ్య నిఖార్సైన హైదరాబాదీ: రేవంత్ రెడ్డి

- రోశయ్య సమర్థత వల్లే తెలంగాణ మిగులు బడ్జెట్ రాష్ట్రంగా ఆవిష్కృతమైందన్న సీఎం
- వైరి పక్షాలను ఇరుకున పెట్టే విధానాన్ని రోశయ్య నుంచి నేర్చుకోవాలన్న సీఎం
- నెంబర్ 1గా ఎంతమంది మారినా నెంబర్ 2 మాత్రం రోశయ్యే ఉండేవారన్న రేవంత్ రెడ్డి





హైదరాబాద్ : దివంగత మాజీ సీఎం కొణి జేటి రోశయ్య నిఖార్సైన హైదరాబాదీ అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసించారు. తనకు రెండు తెలుగు రాష్ట్రాలు సమానమేనని ఆయన ఎప్పుడూ చెప్పేవారన్నారు. రోశయ్య మూడో వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని హైటెక్స్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మిగతా..2లో

## భూకంపాలకు కాళేశ్వరం ఓ కారణం...

### శాస్త్రవేత్త ఆసక్తికర వ్యాఖ్యలు!

2లో

తెలంగాణలోని ములుగులో 5.3 తీవ్రతతో

తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ప్రజలను భయాందోళనకు గురి చేసింది

గత మూడేళ్లుగా వచ్చిన భూకంపాలతో పోలిస్తే రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత ఎక్కువ




హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో బుధవారం ఉదయం 7:27 గంటల ప్రాంతంలో పలు చోట్ల భూమి కంపించింది. తెలంగాణలోని ములుగులో 5.3 తీవ్రతతో వచ్చిన ఈ భూకంప తీవ్రత రెండు తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ప్రజలను భయాందోళనకు గురి చేసింది. ఈ సమయంలో ఈ భూకంపాలపై శాస్త్రవేత్తలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

## బంగ్లాదేశ్‌లో ఉగ్రదాడులు జరిగే అవకాశం.. తమ పౌరులకు ట్రావెల్ అడ్వైజరీ జారీ చేసిన ఇంగ్లండ్



2

బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై పెచ్చుమీరుతున్న దాడులు

జన సమ్మర్ధ ప్రాంతాలు, విదేశీయులు ఎక్కువగా సందర్శించే ప్రాంతాలు, ప్రార్థనా స్థలాల వద్ద ఉగ్రద్దాడులకు ఆస్కారం ఉందని యూకే హెచ్చరిక

ఇస్కాన్ ప్రచారకర్త చిన్మయి అరెస్ట్ తర్వాత దేశంలో హింసాత్మక ఘటనలు

## ఎల్‌ఏసీలో పరిస్థితి ఏంటీ..?

### చైనాతో సంబంధాలపై రాజ్యసభలో జైశంకర్ కీలక ప్రకటన..



2

న్యూఢిల్లీ : విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ బుధవారం రాజ్యసభలో భారత్-చైనా సంబంధాలపై కీలక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా వాస్తవ నియంత్రణ రేఖ వద్ద పరిస్థితులపై సైతం సమాచారం ఇచ్చారు. ఎల్‌ఏసీలో ఇంకా చైనాతో కొన్ని భూభాగాలపై విభేదాలు ఉన్నా యని.. ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతామని జైశంకర్ పేర్కొన్నారు.

## ప్రోబా3లో సాంకేతిక లోపం.. పీఎస్ఎల్వీ సీ59 ప్రయోగం 5కి వాయిదా



2

శ్రీహరికోట: పీఎస్ఎల్వీ సీ59 ప్రయోగం వాయిదా పడింది.శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఇవాళ నింగికి ఎగరాల్సిన ప్రోబా3 స్పేస్‌క్రాఫ్ట్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ప్రయోగాన్ని రేపటికి వాయిదా వేస్తున్నట్లు ఇస్రో ప్రకటించింది. గురువారం సాయంత్రం 4.12 నిమిషాలకు ప్రయోగం ఉంటుందని ఇస్రో చెప్పింది.

## రేవంత్ రెడ్డీ! నాలుగేళ్ల తర్వాత తెలంగాణ తల్లి సరైన స్థానంలో ఉంటుంది: కేటీఆర్



2

- రాజీవ్ విగ్రహం పెట్టిన చోటే తెలంగాణ తల్లి నిటారుగా నిలబడుతుందని వ్యాఖ్య
- కేసీఆర్ మీద కోపంతో తెలంగాణ తల్లి రూపాన్ని మారిస్తే చరిత్ర క్షమించదన్న కేటీఆర్
- ఇందిరాగాంధీ ప్రతిష్ఠించిన భారతమాత రూపాన్ని వాజ్ పేయి మార్చలేదన్న కేటీఆర్

# మధ్యాహ్నం భోజనం విషయంలో లోకేష్ కీలక నిర్ణయం.. అదే కారణం!

మధ్యాహ్న భోజన పథకం విషయంలో ఏపీ మంత్రి నారా లోకేష్ కీలక నిర్ణయం

2019లో జగన్ ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దు చేసింది

కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 7న తల్లితండ్రులు -ఉపాధ్యాయుల సమావేశాలి



అమరావతి : ఏపీలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలవుతున్న సంగతి తెలిసిందే. ఏ రోజు ఏమి కూరలు వండాలనే విషయంపై వీక్లీ మెనూ ఇచ్చి.. స్కూలు పిల్లలకు మధ్యాహ్నం పూట భోజనం పెడుతున్నారు. ఈ సమయంలో.. ఈ పథకంపై మంత్రి నారా లోకేష్ మిగతా..2లో

## ఢిల్లీ-యూపీ సరిహద్దు వద్ద రాహుల్‌గాంధీ, ప్రియాంకను అడ్డుకున్న పోలీసులు.. ఉద్రిక్తత



2లో

- హింసాత్మక ఘటనలతో అట్టుడికిన సంభాల్
- అక్కడికి వెళ్తుండగా అడ్డుకున్న పోలీసులు
- సీనియర్ పోలీసు అధికారితో రాహుల్ మాట్లాడినా ముందుకు వెళ్లేందుకు అనుమతి నిల్
- రోడ్డుపై బారికేడ్లు ఏర్పాటు చేసి ముందుకు కదలకుండా అడ్డుకున్న పోలీసులు
- బారికేడ్ల పైకెక్కి పెద్ద ఎత్తున నినాదాలు చేసిన కాంగ్రెస్ కార్యకర్తలు

## ఏక్‌నాథ్ షిండే మాతోనే ఉంటారు.. ఉండాలని అందరూ కోరుకుంటున్నారు: దేవేంద్ర ఫడ్నవీస్



2

- షిండే ప్రభుత్వంలో ఉండాలని అందరూ కోరుకుంటున్నారన్న ఫడ్నవీస్
- సీఎం, డిప్యూటీ సీఎం టెక్నికల్ పోస్టులు మాత్రమేనన్న ఫడ్నవీస్
- తమ పాలన సువర్ణాక్షరాలతో లిఖించదగ్గదన్న షిండే

## అప్పుల లెక్కలు కాదు.. హామీల లెక్కలు చెప్పు.. రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్



హైదరాబాద్ : అప్పుల లెక్కలు కాదు.. హామీల లెక్కలు చెప్పు.. వడ్డీల ముచ్చట్లు కాదు.. వాగ్దానాల ముచ్చట్లు చెప్పు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. అప్పులపై కారుకూతలు కాదు.. దమ్ముంటే నీ అసమర్థ పాలనపై శ్వేతపత్రం విడుదల చేయ్ అని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. తెలంగాణలో ఏడాది పాలనలో రేవంత్ రెడ్డి లక్ష కోట్ల అప్పులు కొత్తగా చేశారు. రాష్ట్రం అధోగతి పాలైంది.. ప్రజలు తిప్పలపాలయ్యారు. రేవంత్ బ్రదర్సేమో కోట్లకు పడగ లెత్తారు. రేవంత్ పాలన అంటే గుర్తుకొచ్చేది లక్ష కోట్ల అప్పులు, దారుణ ఘాతుకాలు, తప్పులు. ఈ ఏడాదిలో ఏం సాధించావు అంటే సమాధానం లేదు. ఆర్భాటం ,హడావుడి చేస్తున్నారు.

# పెద్దల సభలో జెండా పాతడమే లక్ష్యం..

2లో

ఏపీ నుంచి కొత్త రాజ్యసభ సభ్యులు వీళ్లే..

పెద్దల సభలో జెండా పాతడమే లక్ష్యం..

ఏపీ నుంచి కొత్త రాజ్యసభ సభ్యులు వీళ్లే..?

అమరా వతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మూడు రాజ్యసభ స్థానాలకు ఎన్నికల హడావిడి మొదలైంది. ముగ్గురు సభ్యుల రాజీనామాతో ఖాళీ అయిన స్థానాలకు మం గళవారం నుంచి మిగతా..2లో



## ఆరు నెలల్లోనే ప్రభుత్వంపై ఇంత వ్యతిరేకత రావడం ఎప్పుడూ చూడలేదు: జగన్

అమరావతి : కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్ విమర్శలు గుప్పించారు. ప్రభుత్వంపై ప్రజల్లో విపరీతమైన వ్యతిరేకత ఉందని ఆయన అన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన ఆరు నెలల వ్యవధిలోనే ఇంత వ్యతిరేకత రావడం ఎప్పుడూ చూడలేదని చెప్పారు. సూపర్ సిక్స్ లేదు, సెవెన్ లేదని... కూటమి నేతలను ప్రజలు ఎక్కడికక్కడ ప్రశ్నించే పరిస్థితులు వచ్చాయని అన్నారు. తాడేపల్లిలో పార్టీ ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, జిల్లాల అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమైపోయాయని జగన్ అన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ పెండింగ్ లో ఉందని... జనవరి వస్తే రూ. 2,800 కోట్లు పెండింగ్ అవుతుందని చెప్పారు. వసతి దీవెనకు రూ. 1,100 కోట్లు పెండింగ్ లో ఉందని అన్నారు. తొమ్మిది నెలలుగా ఆరోగ్యశ్రీ బకాయిలు ఉన్నాయని చెప్పారు. నాలుగు నెలలుగా 104, 108 ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం లేదని అన్నారు. కరెంటు ఛార్జీలను బాదే పనులు మొదలయ్యాయని విమర్శించారు. వర్షాల దెబ్బకు రైతులు కుదేలవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉన్న రేటు కంటే డబుల్ రేట్ కి ఇసుక అమ్ముతున్నారని అన్నారు. మద్యం షాపులను చంద్రబాబు, ఆయన మనుషులు చేతిలోకి తీసుకున్నారని ఆరోపించారు. ఒక్కో బెల్టు షాపుకు రూ. 2 నుంచి 3 లక్షలకు వేలం పాట పెడుతున్నారని చెప్పారు. ప్రజల తరపున గళం విప్పాల్సిన సమయం వచ్చిందని... జిల్లాల అధ్యక్షులు క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు.

## బంగ్లాదేశ్‌లో ఉగ్రదాడులు జరిగే అవకాశం.. తమ పౌరులకు ట్రావెల్ అడ్వైజరీ జారీ చేసిన ఇంగ్లండ్

న్యూఢిల్లీ : హింసాత్మక ఘటనలతో అట్టుడుకుతున్న బంగ్లాదేశ్‌లో ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని, జాగ్రత్తగా ఉండాలంటూ తమ పౌరులకు యూకే హెచ్చరికలు జారీ చేసింది. జనసమ్మర్థ ప్రాంతాలు, ప్రార్థనా మందిరాలు, మతపరమైన భవనాలు, విదేశీయులు ఎక్కువగా సందర్శించే ప్రాంతాల్లో ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందంటూ ట్రావెల్ అడ్వైజరీ జారీ చేసింది. దేశద్రోహం ఆరోపణలతో గత నెల 25న ఇస్కాన్ ప్రచార కర్త చిన్మయి కృష్ణదాస్ బ్రహ్మచారిని బంగ్లాదేశ్ ప్రభుత్వం అరెస్ట్ చేసిన తర్వాత అక్కడి హిందూ సమాజంపై దాడులు పెచ్చుమీరాయి. అవి క్రమంగా హింసాత్మక రూపు దాల్చాయి. ఈ నేపథ్యంలో స్పందించిన యూకే తమ పౌరులకు హెచ్చరికలు జారీ చేసింది. ఇస్లాంకు విరుద్ధమైన అభిప్రాయాలు, జీవనశైలి కలిగిన వ్యక్తులను ఉగ్రవాదులు టార్గెట్ చేసుకున్నట్టు యూకే పేర్కొంది. ఈ నేపథ్యంలో ముఖ్య నగరాల్లో ఐఈడీ దాడులు జరిగే అవకాశం ఉందని హెచ్చరించింది. బంగ్లాదేశ్‌లోని 17 కోట్ల జనాభాలో 8 శాతం మాత్రమే ఉన్న మైనార్టీలపై ఇటీవలి కాలంలో 200కుపైగా దాడులు జరిగాయి. చిన్మయిదాస్ అరెస్ట్ తర్వాత ఢాకా, చిట్టగాంగ్‌లలో ఆయన మద్దతుదారులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా భద్రతా దళాలకు వారికి మధ్య తోపులాట జరిగింది.

## ఎల్‌ఏసీలో పరిస్థితి ఏంటీ..? చైనాతో సంబంధాలపై రాజ్యసభలో జైశంకర్ కీలక ప్రకటన..

మొదటి పేజి తరువాయి

జూన్ 2020 గాల్వాన్ లోయరలో జరిగిన ఘర్షణ ఘటన భారత్ %-% చైనా సంబంధాలపై ప్రభావం చూపిందన్నారు. సరిహద్దులో సైనికులు మారణించడం 45 ఏళ్లలో మొదటిసారి కాదని.. అయితే, ఘటన తర్వాత పెద్ద సంఖ్యలో బలగాల మోహరింపునకు దారి తీసిందన్నారు. ఎన్నో సవాళ్లు ఉన్నప్పటికీ.. మన సైనిక బలగాలు కొవిడ్ , లాజిస్టిక్స్ సమస్యలు ఎదుర్కొంటున్న సమయంలోనూ గాల్వాన్ ఘటనలో అవసరమైన మేరకు స్పందించాయన్నారు. తీవ్రమైన చలితోపాటు ఎన్నో సవాళ్ల మధ్య వేగంగా పరిస్థితిని ఎదుర్కొన్నారన్నారు. తూర్పు లద్దాఖ్‌లోని దళాల ఉపసంహరణ దశలవారీగా ప్రక్రియ పూర్తయ్యిందని.. దేప్‌సాంగ్, డెమ్‌చోక్‌లలో పూర్తి కాలేదన్నారు. ఎల్ఏసీ ఒప్పందాలకు కట్టుబడి ఉండడంపై ఇరుదేశాల మధ్య సంబంధాలు ఆధారపడి ఉంటాయన్నారు. సంబంధాలు చాలారంగాల్లో పురోగామించాయని.. ఇటీవలి సంఘటనలు స్పష్టంగా ప్రతికూలంగా ప్రభావితమయ్యాయన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో శాంతిని కొనసాగించడం, సంబంధాల మెరుగునకు ప్రాథమిక షరతులు విధించామని స్పష్టం చేశారు. చైనాతో భవిష్యత్ సంబంధాలపై స్పందిస్తూ.. సమస్యల పరిష్కారానికి సంబంధాలను పెంపొందించుకునేందుకు సరిహద్దులో శాంతి అవసరమన్నారు. చైనా ప్రతినిధులతో ఇటీవల జరిగిన సమావేశాలకు సంబంధించిన వివరాలను సైతం రాజ్యసభకు వివరించారు. ఆ తర్వాత బ్రిక్స్ సదస్సు సందర్భంగా చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ సందర్భంగా ఇరు దేశాల మధ్య సంబంధాలను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు చర్చించారన్నారు. జైశంకర్ ప్రకటన అనంతరం కాంగ్రెస్ సహా ఇతర ప్రతిపక్ష సభ్యులు వివరణ కోరేందుకు అనుమతి కోరగా.. డిమాండ్లను చైర్మన్ జగ్‌దీప్ ధంకర్ తోసిపుచ్చారు. అభ్యంతరం వ్యక్తం చేయడంతో విపక్ష సభ్యులు రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు.

## ప్రోబా3లో సాంకేతిక లోపం.. పీఎస్ఎల్వీ సీ59 ప్రయోగం 5కి వాయిదా

మొదటి పేజి తరువాయి

కృత్రిమ సూర్య గ్రహణాన్ని సృష్టించడం ద్వారా భానుడి గుట్టు విప్పేందుకు ఐరోపా అంతరిక్ష సంస్థ (ఈఎస్ఏ)కు చెందిన ప్రోబా-3 మిషన్ శాటిలైట్లను ఇస్రో నింగిలోకి పంపుతున్నది. నిజానికి ఇవాళ సాయంత్రం 4.06 గంటలకు పీఎస్ఎల్వీ-సీ59 రాకెట్ ద్వారా ఈ ప్రయోగాన్ని నిర్వహించాల్సి ఉంది. కానీ సాంకేతిక లోపంతో ప్రయోగాన్ని వాయిదా వేశారు. ప్రోబా-3 మిషన్‌లో రెండు ఉపగ్రహాలు (కరోనాగ్రాఫ్ స్పేస్‌క్రాఫ్ట్, ఆక్యుల్టర్ స్పేస్‌క్రాఫ్ట్) ఉన్నాయి. మొత్తం దాదాపు 550 కిలోల బరువు ఉండే ఈ ఉపగ్రహాలను అతి దీర్ఘవృత్తాకార కక్ష్యలో ప్రవేశపెడతారు. కృత్రిమ గ్రహణాన్ని సృష్టించడం ద్వారా సూర్యుడి బాహ్య వాతావరణమైన కరోనాను అధ్యయనం చేయడమే ప్రోబా-3 లక్ష్యం. ఆ రెండు ఉపగ్రహాలు పరస్పరం సమన్వయం చేసుకుంటూ క్రమపద్ధతిలో భూకక్ష్యలో విహరించనున్నాయి.

## రేవంత్ రెడ్డీ! నాలుగేళ్ల తర్వాత తెలంగాణ తల్లి సరైన స్థానంలో ఉంటుంది: కేటీఆర్

హైదరాబాద్ : రేవంత్ రెడ్డీ! నువ్వెన్ని కథలు పడ్డా నాలుగేళ్ల తర్వాత తెలంగాణ తల్లి సరైన స్థానంలో ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాహుల్ గాంధీ తండ్రి రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఎక్కడైతే పెట్టారో... అక్కడ తెలంగాణ తల్లి కచ్చితంగా నిటారుగా నిలబడుతుందన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... మూర్తీభవించిన స్త్రీగా తెలంగాణ తల్లిని కేసీఆర్ రూపొందించారన్నారు. కానీ కేసీఆర్ మీద కోపంతో తెలంగాణ తల్లి రూపాన్ని మారిస్తే చరిత్ర క్షమించదని హెచ్చరించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలన్నారు. నాడు ఇందిరాగాంధీ ప్రతిష్ఠించిన భారతమాత రూపాన్ని వాజ్ పేయి అధికారంలోకి వచ్చాక మార్చలేదన్నారు. దేశంలో ఎన్నోచోట్ల అధికార మార్పిడి జరిపినప్పటికీ ఆయా రాష్ట్రాల విగ్రహాల రూపును మార్చలేదన్నారు. తెలంగాణ తల్లి రూపును మాపే ప్రయత్నం ఇకనైనా మానుకోవాలన్నారు. అధికారం ఉందని పోలీసు బలగాల మధ్య మీ నాటకాలు కొంతకాలం మాత్రమే సాగుతాయని... కానీ ఎల్లకాలం ఇదే పరిస్థితి ఉండదని హెచ్చరించారు. అంబేద్కర్ సచివాలయం గురించి, పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ గురించి మాత్రం మాట్లాడటం లేదన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని 2007 ఉద్యమ కాలంలో రూపొందించినట్లు చెప్పారు.

## అప్పుల లెక్కలు కాదు.. హామీల లెక్కలు చెప్పు.. రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్

మొదటి పేజి తరువాయి



ముఖ్యమంత్రి తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు మళ్లీ అప్పులు అంటూ తప్పుడు కూతలు కూస్తున్నాడు. అప్పుల మీద కాదు.. నీ తప్పుల మీద చర్చ జరగాలి. ఇవాళ సూటిగా అడుగుతున్నాం దమ్ముంటే సమాధానం చెప్పు. సీఎం పదవి చేపట్టిన తర్వాత ఆ పదవి స్థాయి దిగజార్చావు. నీ ప్రభుత్వంలో మీ బ్రదర్స్ బాగుపడ్డారు. వారికి లాభం జరిగింది. రాష్ట్రానికి వెయ్యి కోట్ల పెట్టుబడులు ఇచ్చే స్థాయికి అనుముల బ్రదర్స్ ఎదిగారని ప్రజలు అనుకుంటున్నారు. వచ్చే ఏడాది ఫోర్బ్స్ జాబితాలో రిచెస్ట్ బ్రదర్స్ ఎవరంటే అనుముల బ్రదర్స్ అని వస్తదమో.. అదానీని కూడా దాటేస్తారేమో అని ప్రజలు అనుకుంటున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. నీ ఏలుబడిలో రాష్ట్రానికి రాబడి తెచ్చే తెలివి లేదు. సంపద పెంచే సోయి లేదు. పాజిటివ్ పని చేసిన ముఖం లేదు. తెల్లారి లేస్తే కాకి కూతలు.. కేసీఆర్ మీద తిట్టు.. దేవుళ్ల మీద ఒట్లు.. ఇచ్చిన హామీలకు తూట్లు పొడిచావు. రాష్ట్ర ప్రతిష్ట పెంచాల్సింది పోయి.. దివ్యంగా ఉన్న రాష్ట్రం దివాళా తీసిందని ఆరోపణలు చేసిన దివాళాకోరు సీఎంవి నీవు. కొత్త పరిశ్రమలు కాదు.. ఉన్న పరిశ్రమలు తరలిపోతున్నాయి. ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు తీరని అన్యాయం చేస్తున్నారు. ఇవాళ కొత్త స్లోగన్ పెట్టుకున్నాడు.. తెలంగాణ రైజింగ్ అని అంటున్నడు. అనుముల బ్రదర్స్ రైజింగ్ అని పెట్టుకోవాలి. తెలంగాణ మాత్రం ఫాలింగ్ అని చెప్పాలి. పన్నెండు పాలన మొత్తం అసత్యాలు, అటెన్షన్ డైవర్షన్ స్కీంలు తప్ప ఏం పీకారు. అబద్దాల కోరుగా తయారై మీడియా మేనేజ్‌మెంట్ చేస్తున్నావ్. ఆరు గ్యారెంటీల మీద చర్చ జరగొద్దని.. అప్పులు అంటూ కారుకూతలు కూస్తున్నావంటూ రేవంత్ రెడ్డిపై కేటీఆర్ మండిపడ్డారు.

# పెద్దల సభలో జెండా పాతడమే లక్ష్యం..

మొదటి పేజి తరువాయి




నామినేషన్ల పక్రియ ప్రారంభమైంది. డిసెంబర్ 10 వరకు నామినేషన్ దాఖలు చేసేందుకు గడువు ఉంది. మరి, రాజ్యసభ రేసులో ఎవరున్నారు?. ఏ పార్టీ నుంచి ఎవరు సీటు ఆశిస్తున్నారు?. అన్నదీ ఆసక్తికరంగా మారింది. వైఎస్ఆర్సీపీ సభ్యులుగా కొనసాగిన మోపిదేవి వెంకట రమణ, బీదా మస్తాన్ రావు, అర్ కృష్ణయ్యలు రాజీనామా చేయడంతో ఈ ఉపఎన్నికలు అనివార్యమయ్యాయి. ఈ రాజీనామాలు రాష్ట్రంలో మారిన అధికారం, రాజకీయ పరిణామాలకు అనుగుణంగా జరిగాయన్నది విశ్లేషకుల భావిస్తున్నారు. వైఎస్ఆర్సీపీ కి రాజీనామా చేసినా తిరిగి టీడీపీ నుంచి బీదా మస్తాన్ రావు, బీజేపీ నుంచి అర్ కృష్ణయ్యలు తిరిగి ఉపఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. బీదా మస్తాన్ రావు టీడీపీ తరపున, అర్ కృష్ణయ్య బీజేపీ తరపున అభ్యర్థిత్వం దక్కించుకున్నారు. వీరిద్దరికీ 2028 వరకు పదవీ కాలం ఉంది.

టీడీపీ నుంచి బీదా మస్తాన్ రావు

బీద మస్తాన్ రావు తొలుత తెలుగుదేశం పార్టీ నుంచే రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. కావలి టీడీపీ ఎమ్మెల్యేగా కూడా పనిచేశా.రు చంద్రబాబుకి అత్యంత సన్నిహితమైన నేతగా కూడా ఎదిగారు. అయితే, 2019 ఎన్నికల్లో కావలి నుంచి ఓడిపోవడం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న కీలక నేత విజయ సాయిరెడ్డికి సన్నిహితుడు కావడంతో ఆయన విజ్ఞప్తి మేరకు 2022లో రాజ్యసభకు ఆ పార్టీ తరఫున వెళ్లారు. 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కూటమి ఘన విజయం సాధించడంతో తిరిగి ఆయన తెలుగుదేశం గూటికి చేరేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో తన రాజ్యసభ సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని కోరడం, చంద్రబాబు అందుకు అంగీకరించడంతో తిరిగి తెలుగుదేశం పార్టీ తరఫున రాజ్యసభకు వెళ్తున్నారు.

బీజేపీ నుంచి అర్. కృష్ణయ్య..!

బీసీ ఉద్యమ నేతగా ఉన్న ఆర్ కృష్ణయ్య ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభకు పంపించడం అప్పట్లో పెద్ద సంచలనమైంది. తెలంగాణకు చెందిన ఆర్.కృష్ణయ్యను ఆంధ్రప్రదేశ్ నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేయడంతో అనేక విశ్లేషణ జరిగాయి. అయితే బీసీ ఓట్ బ్యాంకు కోసం అప్పట్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆ నిర్ణయం తీసుకున్నట్టుగా కథనాలు వచ్చాయి. దాన్ని తగ్గట్టుగానే ఆర్ కృష్ణయ్య కూడా వైఎస్ఆర్సీపీ తరపున ఆంధ్ర ప్రదేశ్ లో విస్తృతంగా పర్యటించి బీసీలను పార్టీతో మమేకం అయ్యేటట్టు చేసే ప్రయత్నం చేశారు. కానీ 2024 ఎన్నికల్లో దారుణమైన పరాజం తర్వాత కూడా కృష్ణయ్య పార్టీ మారుతారని ఎవరు ఊహించలేదు. గతంలో తెలుగుదేశం బీజేపీ కూటమి తరపున తెలంగాణలో ముఖ్యమంత్రి అభ్యర్థిగా కూడా బరిలోకి దిగి ఎల్బీనగర్ శాసనసభ్యులుగా ఎన్నికైన అర్. కృష్ణయ్య తర్వాత కాలంలో వైఎస్ఆర్సీపీ లు చేరడం, మళ్ళీ ఆ పార్టీకి, రాజ్యసభ కు రాజీనామా చేయడంపై రకరకాల కథనాలు వినిపించాయి. ఆశ్చర్యంగా బీజేపీ అర్. కృష్ణయ్యను పార్టీలో చేర్చుకుని తిరిగి రాజ్యసభకు పంపడం ద్వారా తెలుగు రాష్ట్రాల్లో బీసీ ఓట్లకు గాలం వేసే ప్రయత్నం చేస్తోందన్న విశ్లేషణలు సాగుతున్నాయి.

మోపిదేవి స్థానానికి సానా సతీష్..?

మోపిదేవి వెంకట రమణ రాజీనామాతో ఖాళీ అయిన స్థానం టీడీపీ నేత సానా సతీష్ కు దక్కే అవకాశముందని సమాచారం. 2026 వరకు రెండేళ్ల పాటు ఉండే పదవీ విషయంలో నిర్ణయంపై టీడీపీ కూటమి పార్టీల మధ్య చర్చలు జరుగుతున్నాయి. పార్టీలు అంతర్గతంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసినప్పటికీ, చివరికి సానా సతీష్ పేరును ఖరారు చేసే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

పలువురి ప్రయత్నాలు

ఖాళీ అయిన రాజ్యసభ స్థానాల కోసం టీడీపీలో సీనియర్లు పలువురు అనేక ఆశలు పెట్టుకున్నారు. సీనియర్ల కోట నుంచి అయితే కంభంపాటి రామ్మోహన్ తోపాటు యనమల రామకృష్ణుడు, అశోక్ గజపతిరాజులకు కూడా ఇచ్చే అవకాశం ఉందంటూ కథనాలు వచ్చాయి. అదే సమయంలో గల్లా జయదేవ్ కు కూడా పదవి రావచ్చన్న ఊహాగానాలు వచ్చాయి. జనసేన నుంచి నాగేంద్రబాబుకి ఒక స్థానాన్ని ఇస్తారని అన్నప్పటికీ పదవులపై తన పెద్దగా ఆసక్తి లేదంటూ స్వయంగానే ట్వీట్ చేయడంతో దానికి తెరపడింది. ఇలా అనేక మంది రాజ్యసభ కోసం ప్రయత్నించినప్పటికీ ముందస్తుగా చేసుకున్న ఒప్పందాల మేరకు తిరిగి బీదా మస్తాన్ రావు, ఆర్ కృష్ణయ్య తో పాటు కొత్తగా సానా సతీష్ కి ఈ అవకాశం కల్పిస్తున్నట్లు సమాచారం.

## ఏక్‌నాథ్ షిండే మాతోనే ఉంటారు.. ఉండాలని అందరూ కోరుకుంటున్నారు: దేవేంద్ర ఫడ్నవీస్

న్యూఢిల్లీ : ఏక్‌నాథ్ షిండే తమతోనే ఉంటారని మహారాష్ట్ర కాబోయే ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ధీమా వ్యక్తం చేశారు. 'నిన్న నేను ఏక్‌నాథ్ షిండేను కలిశాను. కూటమి ప్రభుత్వంలో షిండే ఉండాలనేది మహాయుతి కార్యకర్తల అభిప్రాయమని ఆయనకు చెప్పాను. అతను మాతో (ప్రభుత్వంలో) ఉంటాడని నాకు పూర్తి విశ్వాసం ఉంది. మేం ఇచ్చిన హామీలను అమలు చేస్తాం' అని ఫడ్నవీస్ అన్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి తమను ఆహ్వానించాలని దేవేంద్ర ఫడ్నవీస్, ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ గవర్నర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఫడ్నవీస్ మాట్లాడుతూ.. తమ మహాయుతి కూటమి గవర్నర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరామన్నారు. ప్రభుత్వం ఏర్పాటు కోసం మద్దతిస్తున్న వారి సంతకాలతో లేఖ ఇచ్చామన్నారు. రేపు సాయంత్రం ఐదున్నర గంటలకు ప్రమాణ స్వీకారం ఉండనుందన్నారు.

పదవులు టెక్నికల్ పోస్టులు మాత్రమే

ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పదవులు కేవలం టెక్నికల్ పోస్టులు మాత్రమే అన్నారు. కానీ తామంతా మహారాష్ట్ర కోసం పని చేస్తామన్నారు. తదుపరి సమావేశంలో కేబినెట్‌లోకి ఎవరిని తీసుకోవాలో నిర్ణయిస్తామన్నారు. తాను ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తమ కూటమిలోని శివసేన, ఎన్సీపీ గవర్నర్‌కు తెలియజేశాయన్నారు. ప్రధాని మోదీ సమక్షంలో రేపు సాయంత్రం ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. తనతో పాటు ప్రమాణ స్వీకారం చేసే వారిని ఈరోజు సాయంత్రం నిర్ణయిస్తామన్నారు.

పాలన సువర్ణాక్షరాలతో లిఖించదగినది: ఏక్‌నాథ్ షిండే

ముఖ్యమంత్రిగా అభివృద్ధి పథంలో నడిపామని, అందుకు తనకు సంతోషంగా ఉందని ఏక్‌నాథ్ షిండే అన్నారు. మహాయుతి కూటమి ప్రభుత్వం పాలన గుర్తుండిపోయేదన్నారు. ఈ పాలన సువర్ణాక్షరాలతో లిఖించదగినదన్నారు. తమ పాలనలో కీలకమైన నిర్ణయాలు తీసుకున్నామని, ఇందుకు ఆనందంగా ఉందన్నారు. ఉపముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారా? అని మీడియా ప్రశ్నించగా... వేచి చూడాలని ఏక్ నాథ్ షిండే అన్నారు. తాము రాష్ట్రానికి ఏం చేయగలమో అంతా చేస్తామని అజిత్ పవార్ అన్నారు. తాను ప్రమాణ స్వీకారం చేస్తున్నానన్నారు.

బీజేపీ శాసన సభా పక్ష నేతగా ఫడ్నవీస్ ఎన్నిక

బీజేపీ శాసన సభా పక్ష నేతగా దేవేంద్ర ఫడ్నవీస్ ఎన్నికయ్యారు. ఈరోజు బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో ఫడ్నవీస్ పేరును ప్రతిపాదించగా ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఆమోదించారు. కోర్ కమిటీ భేటీ తర్వాత ముంబైలోని విధాన్ భవన్‌లో బీజేపీ శాసన సభా పక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పరిశీలకులుగా నిర్మలా సీతారామన్, విజయ్ రూపాని హాజరయ్యారు. సీఎం ఎంపికపై వారు ఎమ్మెల్యేలతో చర్చించారు. అనంతరం ఫడ్నవీస్‌ను ఎమ్మెల్యేలు శాసన సభా పక్ష నేతగా ఎన్నుకున్నారు.

## ఢిల్లీ-యూపీ సరిహద్దు వద్ద రాహుల్‌గాంధీ, ప్రియాంకను అడ్డుకున్న పోలీసులు.. ఉద్రిక్తత

న్యూఢిల్లీ : హింసాత్మక ఘటనలతో అట్టుడుకుతున్న సంభాల్‌కు వెళ్లేందుకు ప్రయత్నించిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకను ఘజియాబాద్-ఢిల్లీ సరిహద్దులో పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తమను అడ్డుకోవడంతో రాహుల్ వాహనం నుంచి కిందికి దిగి సీనియర్ పోలీసు అధికారితో మాట్లాడారు. అయినప్పటికీ వారు ముందుకు వెళ్లేందుకు ఆయన నిరాకరించారు. బారికేడ్లు ఏర్పాటు చేసిన పోలీసులు రోడ్డును బ్లాక్ చేయడంతో సరిహద్దు వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కాంగ్రెస్ కార్యకర్తలు బారికేడ్ల పైకి ఎక్కి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఉదయం 10.15 గంటల సమయంలో ఢిల్లీలో బయలుదేరిన రాహుల్, ప్రియాంక 11 గంటలకు సరిహద్దుకు చేరుకున్నారు. ఆ తర్వాత వారి కాన్వాయ్ ముందుకు కదలలేదు. రోడ్డు బ్లాక్ చేయడంతో ఇరువైపుల పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కాంగ్రెస్ నేతలు ఇటువైపు రాకుండా అడ్డుకోవాలంటూ సంభాల్ అధికారులు ఇరుగుపొరుగు జిల్లా అధికార యంత్రాంగానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బులంద్‌షహర్, అమ్రోహా, ఘజియాబాద్, గౌతమ్ బుద్ధ నగర్ జిల్లాలకు సంభాల్ జిల్లా కలెక్టర్ లేఖ రాశారు. రాహుల్ గాంధీ కదలికలను దగ్గరుండి పర్యవేక్షించాలని కోరారు. మొఘలుల కాలం నాటి షాహి జమా మసీద్ సర్వే విషయంలో ఇటీవల సంభాల్‌లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ స్థలంలో గతంలో హరిహర ఆలయం ఉందంటూ పిటిషన్ దాఖలైంది.

## మధ్యాహ్నం భోజనం విషయంలో లోకేష్ కీలక నిర్ణయం.. అదే కారణం!

మొదటి పేజి తరువాయి



తాజాగా సంచలన నిర్ణయం తీసుకున్నారు. / అవును... మధ్యాహ్న భోజన పథకం విషయంలో ఏపీ మంత్రి నారా లోకేష్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా... ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని నిర్ణయించారు. పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యపై నిర్వహించిన సమీక్షలో ఈ మేరకు ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా... 2018లో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకూ ఈ పథకం ఉండేదని.. దానివల్ల అప్పట్లో కాలేజీల్లో హాజరు గణనీయంగా పెరిగిందని తెలిపారు. అయితే.. 2019లో జగన్ ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దు చేసిందని.. అయితే మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడంతో ఈ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. పదోతరగతి పూర్తి చేసిన పేద విద్యార్థుల్లో డ్రాపౌట్స్ ఎక్కువగా ఉన్నారని.. అయితే, గవర్నమెంట్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం అందించడం ద్వారా డ్రాపౌట్స్ ను కొంత తగ్గించే అవకాశం ఉందని చెప్పిన మంత్రి లోకేష్... 'సంకల్ప్' ద్వారా చేపట్టిన మదింపు ఆధారంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి.. లెక్చరర్లు, సిబ్బందిని కేర్ టెకర్లుగా నియమించాలని అన్నారు. దీనితో పాటు కాలేజీల్లో దెబ్బతిన్న బిల్డింగులకు మరమ్మత్తులు చేపట్టాలని.. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 7న తల్లితండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించాలని.. ఆ సమావేశాలను సీఎం చంద్రబాబుతో పాటు తానూ హాజరవుతానని వెల్లడించారు. ఈ సమావేశాలు పండుగ వాతావరణంలో జరగాలని తెలిపారు. ఈ సందర్భంగా... విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించే పాఠ్యాంశాల కోసం ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు సలహాలు తీసుకోవాలని.. విద్యార్థులకు జపనీస్ విధానంలో జీవన నైపుణ్యాలు అలవరిచేలా చర్యలు తీసుకోవాలని.. పాఠశాల ఆవరణల్లో ఉద్యోగ మేళాలకు మినహా ఎలాంటి కార్యక్రమాలకూ అనుమతి ఇవ్వకూడదని లోకే ష్ సూచించారు.

## కొణిజేటి రోశయ్య నిఖార్సైన హైదరాబాదీ: రేవంత్ రెడ్డి

మొదటి పేజి తరువాయి

కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... రోశయ్య నిబద్ధత, సమర్థత వల్లే తెలంగాణ మిగులు బడ్జెట్‌గా ఆవిష్కృతమైందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రోశయ్య తనను ఛాంబర్‌కు పిలిపించుకొని ఎన్నో విలువైన సూచనలు చేశారన్నారు. బాగా మాట్లాడుతున్నానంటూ తనపై ప్రశంసలు కురిపించడంతో పాటు మరింత అధ్యయనం చేసి శాసనసభకు రావాలని చెప్పారని గుర్తు చేసుకున్నారు. తమిళనాడు గవర్నర్‌గా అద్భుతంగా పని చేశారన్నారు. పాలకపక్షంలో ఉంటే ప్రతిపక్షాన్ని.. ప్రతిపక్షంలో ఉంటే అధికార పార్టీని, సీఎంను ఇరుకున పెట్టే విధానాన్ని ఆయన నుంచి నేర్చుకోవాలన్నారు. అప్పుడు ఎవరు ముఖ్యమంత్రులుగా ఉన్నా.. నెంబర్ 2 పొజిషన్ మాత్రం రోశయ్యదే అని గుర్తు చేశారు. నెంబర్ వన్‌లో ఉన్న సీఎం మాత్రమే మారుతుండేవారన్నారు. మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్దన్ రెడ్డి, భవనం వెంకట్రామ్, అంజయ్య, కోట్ల విజయభాస్కర్ రెడ్డి, వైఎస్ రాజశేఖరరెడ్డి... ఇలా ఎందరో సీఎంల వద్ద నెంబర్ 2గా ఉన్నారన్నారు. వీరంతా ప్రభుత్వాన్ని ప్రశాంతంగా నడిపించడానికి కారణం రోశయ్యే అన్నారు. సీఎం కావాలని రోశయ్య ఎప్పుడూ కోరుకోలేదని, కానీ సమయం వచ్చినప్పుడు సోనియాగాంధీ ఆయనకు అవకాశం ఇచ్చారని తెలిపారు. తనకు పదవులు కావాలని ఏనాడూ అధిష్ఠానాన్ని కోరలేదు. కానీ అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో రోశయ్యకు సీఎం పదవి అప్పజెప్పారంటే ఆయన పట్ల ఉన్న నమ్మకం, విశ్వాసం ఎలాంటిదో తెలిసిపోతోందన్నారు. రోశయ్య హోదాను కోరుకోలేదు... వాటంతట అవే వచ్చాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆర్థికంగా రాణించాలంటే ఆర్యవైశ్యుల సహకారం ఎంతో అవసరమన్నారు. వారి వ్యాపారాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పార్టీలోనూ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. హైదరాబాద్ నగరంలో రోశయ్యకు విగ్రహం లేకపోవడం పెద్ద లోటు అన్నారు. ఆర్యవైశ్యులు మంచి ప్రాంతాన్ని ఎంపిక చేస్తే ఆర్ అండ్ బీ ఆధ్వర్యంలో విగ్రహ నిర్మాణం చేపడతామన్నారు. వచ్చే వర్ధంతి నాటికి దానిని పూర్తి చేస్తామన్నారు.మాజీ ముఖ్యమంత్రి రోశయ్య వర్ధంతి సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. రోశయ్య ఉన్నప్పుడు ఆయనే నంబర్ 2 అని, నంబర్ 1 మాత్రమే మారేవారని రేవంత్ అన్నారు. ఆయన ఎప్పుడూ తనపైన ఉన్నవారిని దాటిపోవాలని అనుకోలేదని పేర్కొన్నారు. / రోశయ్య అన్నివిధాలా వ్యవహారాలను చక్కబెట్టారు కాబట్టే అప్పటి ముఖ్యమంత్రులు ప్రశాంతంగా పనిచేయగలిగారని రేవంత్ అన్నారు. రోశయ్య 3వ వర్ధంతి కార్యక్రమంలో రేవంత్ ఈ ఇంట్రస్టింగ్ కామెంట్స్ చేశారు. తెలంగాణలో శాసనసభలో రోశయ్యలా వ్యూహాత్మకంగా సమస్యను పరిష్కరించే నాయకుడు లేరన్న లోటు కనిపిస్తోందని సీఎం అభిప్రాయపడ్డారు. సందర్భం, సమయం వచ్చినప్పుడు సోనియాగాంధీ రోశయ్యను ఎంపిక చేశారని, పార్టీ కోసం ఎంతో నిబద్ధతతో పనిచేశారు కాబట్టే ఆయనకు గుర్తింపు లభించిందని తెలిపారు. రోశయ్య తన కాలంలో ఎన్నడు కూడా ఫలానా పదవి కావాలని అడిగిన సందర్భాలు లేవని సీఎం అన్నారు. పార్టీ పట్ల ఆయనకున్న విధేయత వల్లే పదవులు వచ్చాయని తెలిపారు. 2007లో తాను శాసనమండలి సభ్యుడిగా ఉన్న సమయంలో తనకు కొన్ని సలహాలు సూచనలు సైతం ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. ఇరిగేషన్‌పై చాలా అవగాహన ఉందని, లైబ్రరీకి వెళ్లి మరింత అవగాహన పెంచుకుని మాట్లాడితే బాగుంటుందని తనకు చాలా సందర్భాల్లో సూచించినట్లు తెలిపారు. తనకు సూచనలు ఇచ్చిన రోశయ్యను సైతం కొన్ని సందర్భాల్లో ఇబ్బందులు పెట్టాల్సి వచ్చిందని ఫీలయ్యారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రశ్నించాలని, అధికారంలో ఉన్నప్పుడు పరిష్కరించాలని ఆ సందర్భంలో రోశయ్య సూచించినట్లు తెలిపారు. ఇప్పుడు అలాంటి స్ఫూర్తి కలిగిన నేత చట్టసభల్లో లేకుండా పోయారని పేర్కొన్నారు. ట్రబుల్ షూటర్‌గా రోశయ్య కీలక పాత్ర పోషించారని, అందుకే వైఎస్సార్ పని ఈజీ అయిందని అభిప్రాయపడ్డారు. రోశయ్య 16 ఏళ్లు ఆర్థిక మంత్రిగా పనిచేసినట్లు తెలిపారు. ఆయన సామర్థ్యంతోనే తెలంగాణ మిగులు రాష్ట్రంగా ఏర్పడిందని చెప్పారు. రోశయ్య ప్రతిభను చూసే ఆయనకు అధిష్టానం మంత్రి పదవి, ముఖ్యమంత్రి పదవి, గవర్నర్ పదువులు పిలిచి ఇచ్చిందని రేవంత్ తెలిపారు. నిఖార్సయిన హైదరాబాది రోశయ్య అని అన్నారు. హైదరాబాద్‌లో ఆయన విగ్రహం లేకపోవడం లోటేనని అన్నారు. అందుకే హైదరాబాద్‌లో దివంగత నేత, మాజీ సీఎం రోశయ్య విగ్రహం ఏర్పాటు చేస్తామని చెప్పారు.

## భూకంపాలకు కాళేశ్వరం ఓ కారణం...

మొదటి పేజి తరువాయి

అవును... తెలుగు రాష్ట్రాల్లో బుధవారం ఉదయం పలుచోట్ల భూమి కంపించిన సంగతి తెలిసిందే. ఏపీలోనూ, తెలంగాణలోనూ పలు జిల్లాల్లో భూప్రకంపనలు వచ్చాయి. అయితే... తెలంగాణ రాష్ట్రంలో గత మూడేళ్లుగా సంభవించిన భూకంపాల్లో ప్రతీ ఏటా దాదాపు ఒకే ప్రాంతంలో.. ములుగు చుట్టుపక్కల భూమి కంపించడాన్ని గుర్తించినట్లు నిపుణులు పేర్కొన్నారు. కాకపోతే గత మూడేళ్లుగా వచ్చిన భూకంపాలతో పోలిస్తే రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత ఎక్కువని పేర్కొన్నారు. ఇందులో భాగంగా.. 2021లో గడ్చిరోలి సమీపంలో 4.0 తీవ్రతతో భూమి కంపించగా.. 2022లో 3.8, 2023లో భద్రాద్రిలో 3.6 తీవ్రతతో భూకంపాలు సంభవించాయి. తాజాగా భూకంప తీవ్ర 5.3గా నమోదైంది! పెద్ద పెద్ద భూకంపాలు వచ్చే అవకాశం లేదు!: తెలుగు రాష్ట్రాల్లో బుధవారం ఉదయం అలజడి సృష్టించిన భూ ప్రకంపనలపై నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎన్.జీ.ఆర్.ఐ.) రిటైర్డ్ శాస్త్రవేత్త పూర్ణచంద్ర రావు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఇందులో భాగంగా.. తెలుగు రాష్ట్రాల్లో పెద్ద పెద్ద భూకంపాలు వచ్చే అవకాశం లేదని.. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. అయితే.. తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం గతంలోనూ భూకంపాలు సంభవించాయని.. ప్రధానంగా గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో భూమి లోపల పగుళ్లు ఏర్పడతాయని.. వాటి సర్దుబాటు వల్ల అప్పుడప్పుడూ భూకంపాలు వస్తాయని అన్నారు. తాజాగా సంభవించిన భూకంపంలో ప్రధాన కంపనం పూర్తయ్యిందని.. దీనితో పాటు ఇంకా చిన్న చిన్న కంపాలు వస్తే రావొచ్చని అన్నారు. అయితే... తాజాగా సంభవించిన 5.3 తీవ్రతవల్ల పెద్దగా డ్యామేజీ కాదనే తాను భావిస్తున్నట్లు తెలిపారు.గతంలోనూ వరంగల్, ఖమ్మం, భద్రాచలం ప్రాంతాల్లో గతంలోనూ భూకంపాలు వచ్చాయని.. వీటిలో భద్రాచలంలో 1969లో 5.7 తీవ్రతతో సంభవించిందే పెద్ద భూకంపమని అన్నారు. 1967లో ఒంగోలు లో కూడా వచ్చిందని.. వాటి తర్వాత తాజాగా సంభవించిందే పెద్దదని తెలిపారు. భూకంపానికి కాళేశ్వరం ప్రాజెక్టూ ఓ కారణం!: తాజాగా తెలుగు రాష్ట్రాల్లో సంభవించిన భూకంపానికి కాళేశ్వరం ప్రాజెక్ట్ సైతం ఓ కారణం అని సీనియర్ భూగర్భ శాస్త్రవేత్త బీవీ సుబ్బారావు వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో వాటర్ స్టోర్ చేయడం వల్ల ఒత్తిడి పెరిగి, ఇటువంటివి సంభవిస్తాయని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించిన ప్రాంతం మొత్తం డిజాస్టర్ కు అనుకూలంగా ఉంటుందని అన్నారు. ఈ విషయాన్ని కేంద్రం సైతం వెల్లడించిందని చెబుతున్నారని చెప్పిన సుబ్బారావు... కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా భూమిలో నీరు బాగా పెరిగిందని.. ఎప్పుడైతే భూమిలో నీరు పెరుగుతుందో.. అప్పుడు భూమిలోపల ఫలకాల మధ్య కదలికలు తేలిక అవుతాయని.. ఫలితంగా భూకంపాలు వచ్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

జనం
రిపోర్టర్ తెలుగు దినపత్రిక
గురువారం - 05 - డిసెంబర్ - 2024

# కాంగ్రెస్ ప్రజా పాలనకు ఏడాది పూర్తి

## కష్టపడి పని చేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు

### మాజీ ఎంపిటిసి అడ్వకేట్ పసుల నీరజ్



అమరచింత (నర్వ) డిసెంబర్ 4 జనం రిపోర్టర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి చేసుకుని రెండో సంవత్సరంలో అడుగు పెడుతున్నసందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మాజీ ఎంపీటీసీ అడ్వకేట్ ఎంపీటీసీల సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్ పసుల నీరజ్ తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం ఆయన నర్వలో స్థానిక జనం రిపోర్టర్ తో మాట్లాడారు. సరిగ్గా సంవత్సరం క్రితం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కోసం కష్టపడి, చెమటోడ్చి,చలికి ,వానకి,ఎండకి,ఆకలికి దాహానికి తట్టుకొని ,మూడు రంగుల జెండా చేత పట్టుకుని రేవంత్ రెడ్డి గారి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ,పల్లె పట్నం,ఊరు వాడ,గడపగడపకు కాళ్లు అరిగేలా తిరిగి తిరిగి,మొక్కిమొక్కి దండాలు పెట్టి ఓట్లు వేయించి గెలిపించుకున్న కార్యకర్తలకు గ్రామ మండల నియోజకవర్గస్థాయి నాయకులకు,మహిళలకు, ప్రజాప్రతినిధులకు,మాజీ ప్రజా ప్రతినిధులకు,సీనియర్ కాంగ్రెస్ నాయకులకు,యూత్ కాంగ్రెస్ నాయకులకు, ఎన్ ఎస్ యు ఐ నాయకులకు, ఉద్యోగస్తులకు, నిరుద్యోగులకు,విద్యార్థులకు,ప్రత్యక్షంగాను,పరోక్షంగాను కాంగ్రెస్పార్టీకి సహకరించిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటామన్నారు. కాంగ్రెస్ పార్టీ కొరకు కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని పసుల నీరజ్ అన్నారు. ప్రజా పాలనలో భాగంగా మరో నాలుగేళ్ల దిగ్విజయంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని సమర్థంగా నడుపుతారని కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని అలాగే ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని ఆయన అన్నారు.

# చెరుకు టన్ను కు మద్దతు ధర రూ 4000 వేల రూపాయలు బోనస్ 1000 రూపాయలు చెల్లించాలి

## షుగర్ కెన్ కమీషనర్ కార్యాలయం వద్ద రైతులు ధర్నా

### చెరకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జిఎస్ గోపి



/డిసెంబర్ 04(జనం రిపోర్టర్): రాష్ట్ర ప్రభుత్వం చెరకు టన్నుకు మద్దతు ధర రూ.4,000, బోనస్ రూ.1000 అందించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ చెరకు రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రైతులు షుగర్ కెన్ కమీషనర్ హైదారాబాద్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన తెలిపి అదనపు కమీషనర్ కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ చెరకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జిఎస్ గోపి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో చెరకు సాగు రైతులకు గిట్టుబాటు కాకపోవడంతో 2014లో 1.5 లక్షల ఎకరాల విస్తీర్ణం నుంచి 30 వేల ఎకరాల విస్తీర్ణం కి తగ్గిపోయిందన్నారు, 2014 లో 11 షుగర్ ఫ్యాక్టరీలు రన్నింగ్ లో ఉంటే నేడు 7 షుగర్ ఫ్యాక్టరీలు రన్నింగ్ లో ఉండి నెల రోజులు కూడా క్రషింగ్ చేసే పరిస్థితి లేదు అన్నారు, 2023-24 క్రషింగ్ సీజన్లో తెలంగాణ రాష్ట్రం లో 17,24,190 టన్నుల చెరకు 7 ఫ్యాక్టరీల్లో క్రషింగ్ అయిందని టన్ను కు రూ1000 బోనస్ రాష్ట్ర ప్రభుత్వం 200 కోట్ల రూపాయలు లోపు ఇస్తే సరిపోతుంది అన్నారు. తెలంగాణ లో చెరకు సాగు ద్వారా చెరకు ఉప ఉత్పత్తులు వలన రాష్ట్ర ప్రభుత్వం కు 1,000 కోట్ల రూపాయలు ఆదాయం వస్తుందని అన్నారు. అందులో 20 శాతం చెరకు రైతులకు ప్రోత్సాహం కింద తిరిగి బోనస్ రూప లో చెల్లించాలని అన్నారు. చెరకు సాగుకు అవసరమైన యాంత్రీకరణ డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ అందించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం చెరకు ధరకు షుగర్ రికవరీ 8.5 నుంచి 10.25 పెంచడం వల్ల దక్షిణాది రాష్ట్రాల చెరకు రైతులకు తీరని ఆర్థిక నష్టం వాటిల్లిందని అన్నారు. 8.5 రికవరీ పద్ధతిలో ధర నిర్ణయం చేయాలని డిమాండ్ చేశారు. అందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చొరవ చేసి దక్షిణాది రాష్ట్రాల ప్రభుత్వాలు సహకారంతో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు కృషి చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ ఆధారిత చెరకు పరిశ్రమలు మూతపడ్డుతుంటే ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఉపాధి అవకాశాలు మరింత దెబ్బతినే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ చెరకు రైతు సంఘం రాష్ట్రకార్యదర్శి బొంతు రాంబాబు , తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, మాదినేని రమేష్, డి బాల రెడ్డి, చెరకు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రచ్చా నరసింహారావు, తోటకూర రాజు, యనమద్ది లెనిన్, యనమద్ది రామకృష్ణ, శీలం సత్యనారాయణ రెడ్డి, కళ్యాణపు కృష్ణయ్య, ఐనాల రామలింగేశ్వర రావు, పులి కృష్ణయ్య, మాడపాటి రాజేష్, బి వెంకటేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కప్ కి ఎంపికలో భాగంగా భద్రాద్రి జిల్లా పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులు ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ తప్పనిసరి

### భద్రాద్రి జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ జీవి రామిరెడ్డి.



భద్రాచలం డిసెంబర్ 4 జనం రిపోర్టర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరగనున్న సీఎం కప్ 2024 లో పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులు పాల్గొనుటకు తమ రిజిస్ట్రేషన్ ను ఆన్లైన్లో ఎంపిక చేసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ జివి రామిరెడ్డి తెలిపారు. ఈనెల 16వ తేదీన భద్రాచలంలోని అంబేద్కర్ సెంటర్ నందు గల సిటీ స్టైల్ జిమ్ ప్రాంగణంలో సీఎం కప్ కి ఎంపికా పోటీలలో భాగంగా జిల్లాస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా జనరల్ సెక్రెటరీ జీవీ రామిరెడ్డి తెలిపారు. ఈ పోటీలో పాల్గొనే క్రీడాకారులు జూనియర్ బాయ్స్ అండ్ జూనియర్ గర్ల్స్ 23 సంవత్సరాల లోపు మాత్రమే కలిగి ఉండాలి మరియు కేటగిరీలో పురుషులకు 5 కేటగిరీలు కలవు.66 , 74 కేజీ, 83 కేజీ, 93 కేజీ 105 కేజీ మహిళలకు 5 కేటగిరీలు కలవు 52 కేజీ, 57 కేజీ, 63 కేజీ 69 కేజీ, 76 కేజీ, కేటగిరీలు కలవు. రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు క్రింద ఉన్న ఆన్లైన్ లింకును ఓకే చేయగలరు. https://cmcup2024telangana.gov.in/ కావున ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత పవర్ లిఫ్టింగ్ లో ఆడదలిచినవారు ఇంకా పూర్తి వివరాలకు జిల్లా అధ్యక్షులు, భోగాల శ్రీనివాస్ రెడ్డి 9866451107 జిల్లా జనరల్ సెక్రెటరీ జీవీ రామిరెడ్డి 9966 588 688 , జిల్లా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శివ రామకృష్ణ ప్రసాద్ 9493 421088, జిల్లా కోశాధికారి మహంతి వెంకటకృష్ణాజి 8639090580 జిల్లా జాయింట్ సెక్రెటరీ జి శోభన్ నాయక్ 6300062982 పూర్తి వివరాలకు ఈ నెంబర్లను సంప్రదించగలరు.

# విద్యార్థి నాయకుల అక్రమ అరెస్టులు ఉద్యమాన్ని ఆపలేవు....

## ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తున్న ప్రభుత్వం....

### ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం.....




రామగుండం /డిసెంబర్ 04(జనం రిపోర్టర్): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చలో పెద్దపల్లి యువ వికాసం కార్యక్రమానికి పెద్దపెల్లి జిల్లా కేంద్రానికి వస్తున్న తరుణంలో, గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో విద్యార్థి సంఘాల నాయకులను ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం, పిడిఎస్.యు జిల్లా నాయకులు బరిగల ప్రసన్న లను పోలీస్ యంత్రాంగం అక్రమంగా ముందస్తు అరెస్టులు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ...ఉరికొయ్యలు చెరసాలలు ఉద్యమాన్ని ఆపలేవని, అక్రమ అరెస్టులు పోరాటాలను ఆపలేవని, ఎంత అణచివేస్తే అంత పైకి లేస్తామని ఆయన అన్నారు. పెండింగ్ లో ఉన్న 8000 వేల కోట్ల స్కాలర్షిప్ ,ఫీజు రీయింబర్స్మెంట్ ని వెంటనే విడుదల చేయాలని, గురుకుల ,సంక్షేమ హాస్టల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, పాఠశాలలలో, కళాశాలలో కనీస వసతులు కల్పించాలని, పోరాటాలు చేస్తున్న, ప్రశ్నిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులను ముందస్తు అరెస్టు చేయడం సిగ్గుచేటని ఆయన అన్నారు.ప్రభుత్వానికి విద్యార్థులపై చిత్తశుద్ధి ఉంటే విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలే తప్ప... ! ముందస్తు అరెస్టులు చేయడం సరికాదని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరిస్తుందనడానికి ఈ అక్రమ అరెస్టులే సాక్ష్యమని ఆయన అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ,ఫీజు రీయింబర్స్మెంట్ ని వెంటనే విడుదల చేయాలని, గురుకుల ,సంక్షేమ హాస్టల్లోని విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, పాఠశాలలలో, కళాశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## రాజవొమ్మంగిలో హైవేకు ఇరువైపుల

# ఆర్ అండ్ బి సరిహద్దు కొలతలు



రాజవొమ్మంగి, డిసెంబర్ 4 జనం రిపోర్టర్: అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్ రాజవొమ్మంగి మండల కేంద్రంలో నేషనల్ హైవే 16 ఈ రోడ్డు అనుకొని యున్న ఇరువైపులా ఆర్ అండ్ బి సరిహద్దులు ఎంత వరకు ఉందో కొలవడం జరుగుతుందని సరిహద్దు ఆనుకుని ఇరువైపుల నివాసం ఉంటున్న యజమానులకు, వ్యాపారస్తులకు రెవెన్యూ అధికారులు రెవెన్యూ రికార్డులు ప్రకారం సరిహద్దు కొలతలు బుధవారం కొలుచారు ఈకార్యక్రమంలో రెవెన్యూ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని హైవే రోడ్డు వెంబడి ఉన్న ఆర్ అండ్ బి మార్జిన్ సరిహద్దులు ఎంతవరకు ఉందో కొలవడం జరుగుతుందన్నారు ఆర్ అండ్ బి సరిహద్దుల్లో ఇరువైపు నివాసదారులకు,వ్యాపారస్తులకు నోటిసులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు ఆర్ అండ్ బి సరిహద్దుల్లో ఎటువంటి నూతన భవనాలు నిర్మించ వద్దని పేర్కొన్నారు ఈకార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

# రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి



వేటపాలెం డిసెంబర్ 3 ( జనం రిపోర్టర్ ): మండల పరిధిలోని కొత్తపేట-2 రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి కాశీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రతి రైతు తమ పంటకు పి.ఎం.ఎఫ్.బి.వై ఇన్సూరెన్స్ ప్రీమి యం చెల్లించి ఇన్సూరెన్స్ చేయించడం ద్వార ప్రకృతి వైపరిత్యాల సమయంలో రైతు పంట బీవతూ క్లెయిమ్ చేసుకో వచ్చని అదేవిధంగా వరికి ఎకరాకు రూ.232లు మినుము, వేరుశనగ కు ఎకరాకు రూ.64 లు మొక్క జొన్నకి ఎకరాకు రూ. 105లు ప్రీమియం కట్టుకో వాలని తెలిపారు. డిఆర్సి విజయనిర్మల మాట్లాడుతూ అధికంగా రసాయన మందులు పురుగు మందులు వాడకుండా పచ్చి రొట్ట పైరును వేసుకోవాలని భూసార పరీక్షలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ కాశీ విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రతి రైతు ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవా లని తెలియచేశారు. వి.ఏ.ఏ, రైతులు, ఏ.పి.సి.ఎం.ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్తపాలెం లో పొలం పిలుస్తోంది కార్యక్రమం




వేటపాలెం డిసెంబర్ 4 ( జనం రిపోర్టర్ ) మండల పరిధిలోని చల్లారెడ్డి పాలెం పంచాయితీ కొత్తపాలెం లో వి ఏ ఏ జ్యోతి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల ఏవో ఐ కాశీ విశ్వనాథ్ అధ్యక్షత వహించి రైతులతో మాట్లాడటం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినుము పంటలో మినుముతో పాటుగా జొన్న సరిహద్దుగా , ఆవాలు ఎర పంటగా వేసుకోవాలని తెలిపారు. అలాగే ప్రతి ప్రధాన పంటతో పాటుగా కొన్ని అంతర పంటలు వేసుకోవడం మంచిదని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ చీరాల డివిజన్ మాస్టర్ ట్రైనర్ భారతి మాట్లాడుతూ సంఘాల ద్వారా పలు రకాల పంటలు వేసుకోవడంపై అవగాహన కల్పించాలని కోరారు. మినుము లో వేసుకొనే ఎస్ 2 ఎస్ కిట్ ను ఏవో ఐ కాశీ విశ్వనాథ్ ద్వారా రైతుకి అందించడం జరిగింది. తర్వాత రైతు సుబ్బారావు మిరప పొలం పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వి ఏ ఏ జ్యోతి, వి ఓ ఏ తిరుపతమ్మ , ఏపీసీన్ఫ్ క్యాడర్ కరీమున్నిసా, శ్రీనివాసులు, నాగలక్ష్మి రైతులు పాల్గొనడం జరిగింది.

# ప్రభుత్వ ,ప్రైవేటు పాఠశాలల్లో నేషనల్ అచీవ్ మెంట్ సర్వే



ఆత్మకూరు వనపర్తి డిసెంబర్4 జనం రిపోర్టర్: దేశవ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై కేంద్రం నేషనల్ అచీవ్ మెంట్ సర్వే (న్యాస్) పేరిట 3, 6, 9 తరగతి విద్యార్థులకు డిసెంబర్ 4న పరీక్షలు నిర్వహించినట్లు ఆత్మకూరు ఎంఈఓ బాలరాజు బుధవారం తెలిపారు. ఆత్మకూరు పట్టణంలోని (సోం సాగర్ ప్రాథమిక పాఠశాల), (జూరాల ప్రాథమిక పాఠశాల), (ఆరేపల్లి ప్రభుత్వ పాఠశాల), (శ్రీ వాణి హై స్కూల్) (ఎం.వి.రామన్ హై స్కూల్,) (ప్రగతి హై స్కూల్) ,(అక్షర ఉన్నత పాఠశాల), ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించేందుకు సర్వే చేపట్టినట్లు తెలిపారు. 3, 6, 9 తరగతుల విద్యార్థులకు తరగతుల వారీగా భాషా, గణితం ,సైన్స్ ,సోషల్ సైన్స్, పరిసరాల పరిజ్ఞానంపై ప్రశ్నలు అడిగినట్లు



తెలిపారు. ఇందులో అన్ని ఐచ్ఛిక ప్రశ్నలు ఉన్నాయన్నారు. విద్యార్థులు ఓఎంఆర్ పత్రంలో గుర్తించాలన్నారు. మూడో తరగతి విద్యార్థులకు 45 ప్రశ్నలు గంటన్నర సమయం, ఆరో తరగతి విద్యార్థులకు 51 ప్రశ్నలు రెండు గంటల సమయం 9వ తరగతి విద్యార్థులకు 60 ప్రశ్నలు రెండు గంటల సమయం కేటాయించినట్లు తెలిపారు. పాఠశాలలో నేర్చుకునే వాతావరణం మౌలిక వసతులు ఈసారి ఉపాధ్యాయుల నుండి సేకరిస్తామన్నారు. 2021లో న్యాస్ సర్వేలో మన రాష్ట్రం దేశవ్యాప్తంగా చివరి ఐదు స్థానాల్లో ఉందన్నారు. ఈసారి పరిస్థితిని మెరుగుపరచాలని ఉద్దేశంతో విద్యాశాఖ మూడు నమూనా పరీక్షలు నిర్వహించిందని ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం విష్ణువర్ధన్ రెడ్డి. ప్రిన్సిపల్ లత పరిశీలకులు అఖ్తర్ పాషా జాకీర్ హుస్సేన్ ఆయా పాఠశాలల ప్రిన్సిపల్స్ పరిశీలకులు పాల్గొన్నారు.

# 11 మంది జూదరులు అరెస్ట్

### ఎస్ఐ ఎం వెంకటేశ్వర్లు



వేటపాలెం డిసెంబర్ 4 ( జనం రిపోర్టర్ ): మండల పరిధిలోని దేశాయిపేట పంచాయతీ లో గుర్తుచప్పుడు కాకుండా నడుస్తున్న పేకాట శిబిరంపై వేటపాలెం ఎస్ ఐ ఎం వెంకటేశ్వర్లు బుధవారం తన సిబ్బందితో మెరుపు దాడి చేసి 11 మంది జూదరులను అరెస్ట్ చేసి వేటపాలెం పోలీస్ స్టేషన్ తరలించారు. వారి వద్ద నుండి 7250/- నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో ఎవరైనా పేకాట శిబిరాలు,అసాంఘిక కార్యకలాపాలు పాలు పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# దివ్యాంగ్ రక్షక్ పౌండేషన్ మరియు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిరుపేదలకు భోజనం పంపిణీ



డిసెంబర్ 4 పొదిలి జనం రిపోర్టర్: దివ్యాంగ్ రక్షక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫుడ్ కలెక్షన్ ప్రారంభించిన విషయం తెలిసిందే ఈ కార్యక్రమంలో భాగంగా ఈరోజు మానవత స్వచ్ఛంద సేవ సంస్థ వారు పొదిలి కొత్తూరు లోని హైదరాబాదు రెస్టారెంట్ ప్రక్కన బజాజ్ షోరూం ఎదురుగా ఉన్న కాశిరెడ్డి టిఫిన్ సెంటర్లో అయ్యప్ప స్వాములకు భోజనం పెట్టగా భోజనం మిగిలిందని చెప్పగా దివ్యాంగ్ రక్షక్ ఫౌండేషన్ సభ్యులు కాశిరెడ్డి టిఫిన్ సెంటర్ కి వెళ్లి భోజనాన్ని భద్రపరిచి దివ్యాంగ్ రక్షక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరియు మానవత స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో ఈరోజు పొదిలి కాలేజీ రోడ్ లోని శ్రీపతి నగర్ లో పంపిణీ చేయడం జరిగింది . దీని సందర్భంగా ఫౌండర్ మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సేవ సంస్థ ఈరోజు ఈ మంచి కార్యక్రమం అందివ్వడం సంతోషకరం మిగతా వారు కూడా మీ బాధ్యతగా వివాహాది శుభకార్యాలయాలలో మిగిలిన భోజనాన్ని ఫౌండేషన్ కి అందివ్వాలని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఫౌండర్ నరసింహారావు, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, శ్రీను, రాధా తదితరులు పాల్గొన్నారు .

# బోదకాలు నిర్మూలనపై అవగాహన కలిగి వుండాలి



రేపల్లె డిసెంబర్ 4 జనం రిపోర్టర్: బోధకాలు వ్యాధి నిర్మూలన పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ప్రణవి అన్నారు. బుధవారం కూచినపూడి నం దు పంచాయతీలో బోధకాలు పరీక్షలునిర్వ హిస్తున్నా మన్నారు. ఇప్పటి వరకు 300 లకు పైగా పరీక్షలు నిర్వహించామని తెలిపారు. మురుగు కాల్వలలో పెరిగే క్యూలేక్స్ దోమల వలన బోదకాలు వ్యాధి వస్తుందన్నారు.వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి కోరారు. వ్యాధి రాక ముందే జాగ్రత్తగా ఉండాలని ...పరిసర ప్రాంతాల్లో ఎప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని వివరించారు.వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు బోదకాలు నివారణ పై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ మురళీ, సి హచ్ ఓ విజయం, వైద్య సిబ్బంది సింధు, దివ్య, ఆశ వర్కర్లు పాల్గొన్నారు...

# పోలింగ్ స్టేషను పరిశీలించిన అధికారులు



మొగల్తూరు,డిసెంబరు4. జనం రిపోర్టర్: పోలింగ్ స్టేషన్ లో ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని తహసీల్దార్ కె.రాజ్ కిషోర్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం నిర్వహించే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబందించి మొగల్తూరు ఉన్నత పాఠశాలలో కేటాయించిన 116వ పోలింగ్ స్టేషన్ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బందికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాల న్నారు. ఈపోలింగ్ కేంద్రంలో 87 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారన్నారు. ఆయన వెంట ఎన్నికల అధికారి మోహనరావు, అసిస్టెంట్ పోలింగ్ అధికాఆరులు ముచ్చర్ల నాగేశ్వరరావు, ఎంవి కిశోర్, ఎం.సత్యనారాయణ, విఆర్వో డి.సత్య నారాయణ, ఏఎస్ఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఆలూరు స్టేజ్ వద్ద ప్రమాద బారిన పడిన కుటుంబాలను పరామర్శించిన చేవెళ్ళ మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, చేవెళ్ళ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీమ్ భరత్ ..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి చేవెళ్ల డిసెంబర్ 4 (జనం రిపోర్టర్): చేవెళ్ళ మండలం ఆలూరు స్టేజ్ దగ్గర జరిగిన ప్రమాదం లో మరణించిన , గాయపడిన వారి కుటుంబాలను ఓదార్చి వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చిన మాజీ ఎంపి రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య చేవెళ్ళ అసెంబ్లీ ఇంచార్జీ భీమ్ భరత్ వారికి కొంత ఆర్థిక సహాయం అందజేశారు . వీరితో పాటుగా పాల్గొన్న రాష్ట్ర నాయకులు , జిల్లా నాయకులు, చేవెళ్ళ నియోజక వర్గం అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు , కార్యకర్తలు ,యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.....

# అయ్యప్ప నామ స్మరణతో మార్మోగిన తాండూర్..!!

### మహా పడిపూజ నిర్వహించిన పట్నం ఫ్యామిలీ..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి తాండూర్ డిసెంబర్ 4 (జనం రిపోర్టర్): అయ్యప్ప నామ స్మరణతో తాండూర్ మార్మోగింది. తాండూర్ లోని అయ్యప్ప నగర్ లోని శ్రీ శ్రీ శ్రీ ధర్మశాస్త అయ్యప్ప స్వామి దేవాలయంలో మాజీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పట్నం సునీతమ్మ, తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి దంపతుల తనయుడు, యువనేత పట్నం రినీష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమం అద్యాంతం భక్తి శ్రద్ధలతో ఘనంగా సాగింది. అయ్యప్ప స్వామి భజనలు, కీర్తనలతో భక్తులు తరించారు. పట్నం రినేష్ రెడ్డి పడి ముట్టించే కార్యక్రమం అనంతరం అన్నప్రసాదాలు మహేందర్ రెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు భక్తులకు స్వయంగా వడ్డించి మొక్కులు తీర్చుకున్నారు. సీనియర్ నాయకుడు కరణం పురుషోత్తం రావు, మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న పరిమళ్ గుప్త, మహేందర్ రెడ్డి సునీతమ్మ దంపతుల కూతురు మనిషా రెడ్డి అల్లుడు హిమదీప్ రెడ్డి, నర్మదా దేవి,



కౌన్సిలర్లు శోభారాణి, ప్రవీణ్ గౌడ్ ,మన్నపురం రాము, బోయ రవి రాజు, డిసిసిబి వైస్ చైర్మన్ రవీందర్ గౌడ్, మాజీ జెడ్పిటిసి రాకేష్ మహారాజ్, సిద్రాల శ్రీనివాస్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్, మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వనాథ్ గౌడ్,సురేందర్ రెడ్డి,తాండూర్, బషీరాబాద్, యాలాల్, పెద్దేముల్, బంటారం, కోట్పల్లి, వికారాబాద్, కొడంగల్, బొమ్మరాస్పేట ల తో పాటు కర్ణాటక రాష్ట్రానికి చెందిన అయ్యప్ప మాల ధరించిన స్వాములకు, అయ్యప్ప భక్తులు, తాండూర్ నియోజకవర్గం ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దివ్యాంగులను ఆర్థికంగా ప్రోత్సహించడం అభినందనీయం

## వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్..!!




వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 4 (జనం రిపోర్టర్): దివ్యాంగులం అయినప్పటికీ మేము కూడా ఎందులోనూ తక్కువ కాదు అనే మనోధైర్యంతో కష్టపడి చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న దివ్యాంగులను డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్వారు ఆర్థికంగా ప్రోత్సహించడం అభినందనీయం అని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ అన్నారు. ఈరోజు అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వికారాబాద్ పట్టణంలోని వికారాబాద్ క్లబ్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి చైర్ పర్సన్ గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్ కుమార్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎర్రవల్లి జాఫర్, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ దేవి, జిల్లా కోఆర్డినేటర్ రామేశ్వర్, వికలాంగుల సంఘం నాయకులు, వికలాంగులు తదితరులు పాల్గొన్నారు.

## పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు గారి 102 వ జయంతి




డిసెంబర్ 4 పొదిలి జనం రిపోర్టర్: చలన చిత్ర నేపథ్య గాయకులు, గాన గంధర్వులు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు గారి 102 వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించిన పొదిలి మున్సిపల్ కమిషనర్ పూసల శ్రీనివాసులు.ఘంటసాల జయంతి వేడుకలు స్థానిక త్యాగరాజ నగర్ లో డిసెంబర్ 4 వతేది బుదవారం పొదిలిలో నిర్వహిస్తున్నట్లు చైతన్య కళా ప్రవంతి వ్యవస్థాపక అధ్యక్షులు నాగశ్రీ అన్నారు. 4 వ తేదీన ఉదయం 10 గంటలనుండి రాత్రి పది గంటల వరకు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నాగశ్రీ సతీమణి ప్రసున అన్నారు.డాక్టర్ ఏస్ రహంతుల్లా గారిచే ఘంటసాల అష్టావధానం జరుగుతుందని అన్నారు. అంతే కాకుండా గీతం యూనివర్శిటీ హైదారాబాద్ లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తూ నాట్యం లో డాక్టరేట్ పొందిన గొప్ప నర్తకి కీర్తి శేషులు వేంపటి చినసత్యం మనవరాలు బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ వల్లూరి లలితా సిందురి చే నృత్యాప్రదర్శన ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.కాకినాడ కు చెందిన ప్రముఖ గాయకులు వానపల్లి ప్రభాకర్ మాట్లాడుతూ ఘంటసాల గారి జయంతి సందర్భంగా పొదిలి లో ఇంత పెద్ద కార్యక్రమం నిర్వహించడం చాలా గొప్ప విషయం అని రాష్ట్రం నలుమూలల నుంచి గాయని గాయకులు విచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మీ ప్రోత్సాహంతో భవిష్యత్ లో ప్రతి నెలకి ఒకటి లేదా రెండు చొప్పున ఈ త్యాగ రాయ కళాక్షేత్రంలో నిర్వహిస్తానని నాగశ్రీ తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల కళాకారులు,మున్సిపల్ కమిషనర్ పూసల శ్రీనివాసులు, మండల విద్యాశాఖాధికారి ఎం శ్రీనివాసరెడ్డి,శానిటరీ ఇన్స్పెక్టర్ మారుతి రావు,డాక్టర్ మణి,మానవత కార్యదర్శి బండి అశోక్,గాయకులు షేక్ మహమ్మద్ రఫీ,రోటీ యస్థన్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు



మొగల్తూరు,డిసెంబరు4. జనం రిపోర్టర్: రాష్ట్రీయ బాల స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా బుధవారం మంలంలోని వారతిప్ప ప్రాధమికొన్నత పాఠశాలలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 35 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించివారి వివరాలను ఆన్లైన్ చేయడం జరిగిందని వైద్య సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రదానో పాధ్యాయులు సూర్యప్రకాష్, ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీదేవి, వైద్య సిబ్బంది దొంగ నీలిమ, కృప, వి.హైమ ఝాన్సీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## 7వ తేదీన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం




నార్పల/డిసెంబర్ 04(జనం రిపోర్టర్): మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో 7వ తేదీ , శనివారం ఉదయం 9 గంటలకు మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహిస్తు న్నట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆలూరు రవికుమార్ తెలిపారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తు నిర్మాణం కోసం విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాల ఉపాధ్యాయుల సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ సమావేశం జరుగుతున్నట్టు ఆయన వెల్లడించారు. ఈ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులందరూ తప్పకుండా హాజరుకావాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్ కోరారు. సమావేశం గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వర్తమానం పంపించామని కూడా తెలిపారు.

## 6వ తేదీ నుండి గ్రామ రెవెన్యూ సదస్సులు



నార్పల/డిసెంబర్ 04(జనం రిపోర్టర్): మండల వ్యాప్తంగా ఈనెల 6వ తేదీ నుండి గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ తహసిల్దార్ శ్రీనివాసమూర్తి పత్రికా ప్రకటన విడుదల చేశారు. గ్రామ రెవెన్యూ సదస్సులో రైతులు తమ సమస్యల్ని అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని డిటి శ్రీనివాసమూర్తి కోరారు.

## పలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది




(కాకుమాను డిసెంబర్ 4 జనం రిపోర్టర్): మండల పరిధిలోని వల్లూరు,లింగగుంట్లవారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యసాయాధికారి కె.కిరణ్మయి బుదవారం తెలిపారు. కిరణ్మయి మాట్లాడుతూ వర్షాలకి పడిపోయిన పైర్లను పైకి లేపి కట్టుకోవాలని, మొలకలు రాకుండా కట్టలుగా కట్టి వాటి మీద 200 లీ. నీటికి రెండు శాతం ఉప్పు ద్రావణాన్ని తీసుకొని కట్టలు కట్టిన పైర్ల మీద స్ప్రే చేసుకోవాలని తెలియజేయడం జరిగింది. రైతు సేవా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఉన్నారనీ ధాన్యాన్ని ప్రభుత్వానికి అమ్ముకోదల్చిన రైతులు ధాన్యాన్ని బాగా ఆరబెట్టి 17 % లోపు తేమ ఉండేటట్లు చూసుకోవాలని తెలియచేశారు.సాధారణ రకము(కామన్) క్వింటా 2300/- రూ , 75 కేజీలకు గాను 1725 రూపాయలు మరియు గ్రేడ్ 'ఏ 'రకము క్వింటా 2320/- , 75 కేజీలకు 1740 రూపాయలు మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించింది అని రైతులకు తెలియజేశారు.ఒకవేళ ఇంకా 22% తేమ శాతం ఉన్నట్లయితే గుంటూరు జెసి కింటాకు 5 కిలోల చొప్పున తగ్గించుకొని ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్మాలని తెలియజేయడం జరిగింది. రైతు లకు గోనెసంచులు కానీ హమాలీలు కానీ మరియు రవాణా కానీ ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం లెక్కల ప్రకారం ఆ పైకం నేరుగా రైతుల ఖాతాలోకి దాన్యం సొమ్ముతో సహా చెల్లించబడుతుంది అని వివరించారు. ఈ కార్యక్రమంలో వెంకట రెడ్డి , ఎంపీటీసీ, లింగగుంట్ల పాలెం గ్రామ సర్పంచ్ షేక్ అబ్దుల్ , వి ఏ ఏ హేమంత్, , మరియు ఆయా గ్రామ రైతులు పాల్గొన్నారు

## ఆరు గ్యారంటీలు అమలు చేయాలంటూ మక్తల్ లో బిజెపి బైక్ ర్యాలీ



అమరచింత మక్తల్ డిసెంబర్ 4 జనం రిపోర్టర్: భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షుల ఆదేశాలమేరకు నేడు మక్తల్ నియోజకవర్గంలో బీజేపీ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించి, డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ కూడలిలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి బీజేపీ పార్టీ అధ్యక్షుడు శ్రీ కిషన్ రెడ్డి విడుదలచేసిన చార్జీషీట్ పైన బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంగం సభ్యుడు శ్రీ నాగూరావు నామాజీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేతగాని తనాన్ని, అసమర్థ నాయకత్వాన్ని ఎండగట్టి, భారతదేశం సుభిక్షముగా ఉండాలంటే శ్రీ నరేంద్రమోడీ అడుగుజాడల్లో నడవాలనికొరారు., రాబోయే ఎన్నికలలో బీజేపీ పార్టీని గెలిపించాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పగడాకుల శ్రీనివాసులు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీ బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ భాస్కర్, శ్రీమతి ప్రసన్న బలరాంరెడ్డి , కర్నేస్వామి, సంకారోల్ల రవికుమార్,ఓబులాపూర్ నారాయణ, జయానంద్ రెడ్డి, విద్యాసాగర్,రాజశేఖర్ రెడ్డి రాంమాధవ్ ,లక్ష్మీకాంత్ రెడ్డి కనకరాజు ,మల్లేష్ అంజి ముదిరాజు,మనోహర్ ,జగన్నాధం,మిలిటరీ హన్మంత్ బీజేపీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



### ట్రెండ్ కు తగ్గట్లుగా నూతన హంగులతో

## శ్రీ వేంకటేశ్వర థియేటర్



రాజవొమ్మంగి, డిసెంబర్ 4 జనం రిపోర్టర్: అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్ రాజవొమ్మంగి మండల కేంద్రంలో స్థానిక శ్రీ వేంకటేశ్వర థియేటర్ నూతనంగా సరికొత్త హంగులతో ట్రెండ్ కు అనుగుణంగా అత్యాధునిక సౌండ్స్ సిస్టం,సాంకేతిక టెక్నాలజీ తో అన్ని రకాల హంగులతో ఇటీవల దేవర సినిమాతో శ్రీ వేంకటేశ్వర థియేటర్ ప్రారంభించడమైనది ఈ సందర్భంగా థియేటర్ యాజమాన్యం మాట్లాడుతూ లేటెస్ట్ డిజిటల్ సౌండ్స్, కుర్చునేందుకు వీలుగా కుషన్ షీట్స్,ఏసీ,బయట అహ్లాదకరమైన పార్క్, అందరికీ నచ్చేలా నూతన ఆలోచనలతో శ్రీ వేంకటేశ్వర థియేటర్ ని తయారు చేయడం జరిగిందని తెలిపారు థియేటర్ ప్రారంభమైనప్పటి నుంచి రిలీజ్ సినిమాలు ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు అందులో భాగంగా బుధవారం రాత్రి నుంచి పుష్ప సినిమా బెనిఫిట్స్ షోతో పుష్ప సినిమా ప్రదర్శించడం జరుగుతుందని తెలియజేస్తూ మా నూతన వ్యాపారాభివృద్ధికి సినీ ప్రియులు తోడ్పాటు అందించాలని ఆశిస్తున్నామని వారు కోరారు



## జూలపల్లి లో బిఆర్ఎస్ పార్టీ నాయకుల అక్రమ అరెస్టు చేయడం

### -కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ నియంత్రుత్వ పాలనకు నిదర్శనం

### పెద్దపల్లి జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్.



జూలపల్లి డిసెంబర్ 4 జనం రిపోర్టర్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్దపల్లి జిల్లాకు రానున్న సందర్భంలో పెద్దపల్లి జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ ని కరీంనగర్ లోని వారి నివాసంలో అరెస్ట్ చేసి జూలపల్లి పోలీస్ స్టేషన్ కి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా రఘువీర్ సింగ్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంలో కెసిఆర్ సారధ్యంలో అనేక సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను సైతం విజయవంతంగా అమలు పరిచారు. కాని ఇప్పటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి సంవత్సరకాలం సమయమిచ్చిన 420 అమలు గాని హామీలను మేనిఫెస్టోలో పెట్టి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే హామీలను అమలు చేస్తామని చెప్పి ఓట్లు దండుకున్న రేవంత్ రెడ్డి సంవత్సర కాలం గడిచినా రైతు సోదరులకు రైతు బంధు కానీ, ఆంక్షలు లేని రుణమాఫీ కానీ కౌలు రైతులకు, రైతు కూలీలకు సాయం కానీ వితంతు, వృద్ధాప్య, దివ్యాంగుల పెన్షన్లు నెలలోపే రెట్టింపు పెంచి ఇస్తామని వాటి ఊసెత్తలేదని, కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ ద్వారా లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తానని, మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళకు ఇస్తానన్న 2500 రూపాయల తోపాటు కేసీఆర్ కిట్టును ఎగ్గొట్టారని వీటన్నింటినీ అమలు చేయడానికి సంవత్సర కాలం సమయం ఇచ్చినా అమలు చేయకపోగా ప్రశ్నించినందుకు ఇలా అక్రమ అరెస్టులు చేయడం ఎంతవరకు సమంజసమని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ రానున్న కాలంలో ప్రజలే మీకు బుద్ది చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ఎలిగేడ్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, జూలపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మరియు నాయకులు పొలగాని సతీష్, పూరెల్ల గంగయ్య, లక్కాకుల శ్రీనివాస్, కన్నం రమేష్, తొగరి శ్రీనివాస్, మెండ ఓదెలు, కొత్త శ్రీధర్, లంక తిరుపతి తొంటి రాజేశం, మహమ్మద్ అంకూస్, బండి రాజిరెడ్డి, చుక్క మల్లేశం, మేర శ్రీనివాస్, గంగిపల్లి శ్రీనివాస్, మల్లెత్తుల నర్సయ్య, మల్లెత్తుల కనకయ్య, మల్లారపు అంజయ్య,అరికిల్ల శంకర్, మల్లెత్తుల రమేశ్, లక్కెట్టి సాయి, తాజోద్దీన్, పల్లె సురేష్ గౌడ్, మద్దెల నరేష్, సంపత్, గుండు సాగర్, సిలువేరి మహేష్, అబ్బుమియా, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రోశయ్య కు నివాళి



వేటపాలెం డిసెంబర్ 4 (జనం రిపోటర్ ) మండల పరిధి లో ని ఐక్యవేదిక ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రివర్యులు తమిళనాడు మాజీ గవర్నర్ డాక్టర్ కొణిజేటి రోశయ్య తృతీయ వర్ధంతి సందర్భంగా బుధవారం చిత్రపటమునకు అంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వెంకట సుబ్బారావు మాట్లాడుతూ అనేకమైన టువంటి పదవులను నిర్వహించి ఎదుగుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రిగా చేసినటువంటి సేవలను, అదే విధంగా చీరాల నియోజకవర్గ అభివృద్ధికి చేసినటువంటి సేవలను, జీడిపప్పు పరిశ్రమకు, వస్త్ర పరిశ్రమకు చేసినటువంటి సేవలను కొనియాడినారు. రోశయ్య అంటే చీరాల అనే ముద్రను ప్రజల మనస్సులో నిలిచిన మహోన్నత నాయకుడు .ఈ రోజున తీరప్రాంతము అభివృద్ధి చెందుతుంది అంటే రోశయ్య వేసినటువంటి బాట అని అన్నారు శివప్రసాద్ రావు .అదేవిధంగా ఉప సర్పంచ్ మాజీ శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ వారి టైంలో వేటపాలెం అభివృద్ధికి బాటలు వేసింది అని చెప్పి చెప్పియున్నారు. ఈ కార్యక్రమంలో అందరూ కూడా రెండు నిమిషాలు మౌనం పాటించి వారికి ఘన నివాళులు అర్పించి పుష్పాలతో అంజలి ఘటించారు. వేటపాలెం దేవస్థానం మాజీ ఉపాధ్యక్షులు ఆత్మకూరు వెంకట అప్పారావు మరియు దత్తక్షేత్రం కోశాధికారి గుర్రం రంగనాయకులు రావురుపేట సేవా సంఘం చెంద్రపాడు రామకృష్ణారావు గారు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వేటపాలెం పట్టబద్దుల సంఘం అధ్యక్షులు ఆర్యవైశ్య ప్రముఖులు ప్రత్తి వెంకట సుబ్బారావు ,మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర విశ్రాంతి ఉద్యోగుల గౌరవ అధ్యక్షులు శివప్రసాద రావు ఆర్యవైశ్య పెద్దలు ఊటుకూరు శ్రీమన్నారాయణ, మాజీ ఉపసర్పంచి పొన్నూరు శ్రీనివాసగుప్త ,స్టేట్స్ ఎస్సీ సెల్ అధ్యక్షులు బెంజిమెన్, మాల మహానాడు నాయకులు సాల్మన్ ,రెడ్డి సంఘం యువ నాయకులు సుధాకర్ రెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు ఖాదర్ , వేటపాలెం మహిళా నాయకులు భువనేశ్వరి, కాలం సుబ్బులు, సీతారావమ్మ, పద్మ , కరిమూన్,వైశ్య విద్యార్థి అధ్యక్షులు పొన్నూరు రమేష్ కుమార్,కాకతీయ సేవా సంఘం జిల్లా యువ నాయకులు కరణం మురళీకృష్ణ , పాకనాటి రెడ్డి సేవాసమితి నాయకులు శ్రీనివాస రెడ్డి, వాసవి క్లబ్బుల నాయకులు ప్రతి సుబ్బారావు సన్నాఫ్ రామచంద్రరావు, పూల శ్రీనివాసరావు, మస్తాన్ రెడ్డి , రోటరీ క్లబ్ కార్యదర్శి ఊట్కూరి లక్ష్మణస్వామి, తదితరులు పాల్గొని ఘన నివాళులర్పించారు

## బలలహక్కులపై చిన్నారులకు అవగాహన



రేపల్లె డిసెంబర్ 4 జనం రిపోర్టర్ : జిల్లా మహిళా శిశు సంక్షేమ శేఖ వారి ఆధ్వర్యంలో 100 రోజుల అవగాహనా కార్యక్రమంలో భాగంగా ఈ రోజు పేటేరు జడ్పీ హైస్కూల్ నందు బాలల హక్కుల పై అవగాహనా కార్యక్రమంను ఏర్పాటు చేసి బాలల హక్కుల గురుంచి మరియు 109 8 ఛై ల్డ్ హెల్ప్ లైన్ , బాల్య వివాహాలు నిర్మూలాన గురుంచి, గుడ్ టచ్ బేడ్ టచ్ అవగాహన కల్పించటం జరిగింది. తరువాత బాల్య వివాహల నిర్మూలన కోసం ప్రతిజ్ఞ నిర్వహించటం జరిగింది. ఈకార్యక్రమంలో జి. కృష్ణ జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎం సుచిత్ర సీడీపీఓ నాంచారమ్మా వెంకటరత్నమ్మ - సూపెర్వైసోర్స్ ఎం - పద్మావతి - ఇంచార్జ హెచ్ ఎం అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు

## కాంగ్రెస్ ప్రజాపాలన విజయోత్సవాల సంబరాలలో భాగంగా

## 126 డివిజన్ జగద్గిరిగుట్ట లో కొలన్ హన్మంత్ రెడ్డి



కుత్బుల్లాపూర్/డిసెంబర్ 04(జనం రిపోర్టర్): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ ప్రజాపాలన విజయోత్సవాల సంబరాలలో భాగంగా 126 డివిజన్ జగద్గిరిగుట్ట బస్సు స్టాప్ పరిధిలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో నిర్వహించిన పరిశుద్ధ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని కార్మికులకు చీరలు మరియు నిత్యావసర సరుకులు పంపిణీ చేసాన తెలంగాణ ప్రజాపాలన విజయోత్సవాల సంబరాల కో-ఆర్డినేటర్ ఇంచార్జి పన్యాల శ్రవణ్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి గార్లు . ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వరమ్మ, డివిజన్ అధ్యక్షులు గణేష్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఐలయ్య, నరేందర్ రెడ్డి , రవి, శ్రీనివాస్ చారీ , బూచి రెడ్డి,పిల్లి ఆంజనేయులు,వేణు గౌడ్, భరత్, ఆర్ .కే, రామకృష్ణ, అఖిల్, రత్నేశ్వర్, రాంబాబు, మహిళ కాంగ్రెస్ నాయకురాలు స్వాతి, అనిత రెడ్డి, సన తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ప్రజాపాలన విజయోత్సవాల సంబరాలలో

### భాగంగా 126 డివిజన్ జగద్గిరిగుట్ట లో కొలన్ హన్మంత్ రెడ్డి



కుత్బుల్లాపూర్/డిసెంబర్ 04(జనం రిపోర్టర్): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ ప్రజాపాలన విజయోత్సవాల సంబరాలలో భాగంగా 126 డివిజన్ జగద్గిరిగుట్ట బస్సు స్టాప్ పరిధిలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో నిర్వహించిన పరిశుద్ధ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని కార్మికులకు చీరలు మరియు నిత్యావసర సరుకులు పంపిణీ చేసాన తెలంగాణ ప్రజాపాలన విజయోత్సవాల సంబరాల కో-ఆర్డినేటర్ ఇంచార్జి పన్యాల శ్రవణ్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి గార్లు . ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వరమ్మ, డివిజన్ అధ్యక్షులు గణేష్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఐలయ్య, నరేందర్ రెడ్డి , రవి, శ్రీనివాస్ చారీ , బూచి రెడ్డి,పిల్లి ఆంజనేయులు,వేణు గౌడ్, భరత్, ఆర్ .కే, రామకృష్ణ, అఖిల్, రత్నేశ్వర్, రాంబాబు, మహిళ కాంగ్రెస్ నాయకురాలు స్వాతి, అనిత రెడ్డి, సన తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి భగవద్గీత పోటీలకు అన్నమాచార్య విద్యార్థిని



నందలూరు/డిసెంబర్ 04(జనం రిపోర్టర్): రాష్ట్ర స్థాయి భగవద్గీత పోటీలకు మండలంలోని శ్రీ అన్నమాచార్య అకాడమీ విద్యార్థిని ఓజస్వి గంగ ఎంపిక అయినట్లు పాఠశాల కరస్పాండంట్ సమ్మెట శివ ప్రసాద్, డైరెక్టర్ మాడపూరి హేమలత తెలిపారు. శివదర్శననంద స్పీరిచ్యువల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో గత నెల రోజులుగా వివిధ స్థాయిలలో నిర్వహిస్తున్న భగవద్గీత పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకి ఎంపిక అయినట్లు వారు తెలిపారు. ఈ నెల 11న గీత జయంతి సందర్భంగా ప్రొద్దుటూరు లో రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సమ్మెట ఉమా మహేష్, అధ్యాపక బృందం విద్యార్థిని అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి




హసన్ పర్తి మండలం డిసెంబర్ 4 జనం రిపోర్టర్: హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలంలోని ఎం.జె.ఎఫ్ వర్కింగ్ జర్నలిస్టులు బుధవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు ను జిల్లా కలిశారు.జర్నలిస్టుల సమస్యలపై ఎమ్మెల్యే కి వినతి పత్రం అందించారు.గత ప్రభుత్వము నుండి ఎలాంటి ఆదరణ లేనందున ఈ రాష్ట్ర ప్రభుత్వం ఎం జి ఎఫ్ కమిటీ కి ప్రభుత్వ స్థలంలో ఇళ్ల స్థలాలు ఏర్పాటు చేయాలని ఇప్పుడు రాబోవు ఇందిరమ్మ పథకం వర్తింప జేసే విధంగా ఎమ్మెల్యే తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం జె ఎఫ్ మండల అధ్యక్షుడు సందెల రాజు, ప్రధాన కార్యదర్శి రామంచ మధుకర్, గౌరవ అధ్యక్షులు సింగారపు బాబు, రాజారపు బిక్షపతి,రేణుకుంట్ల దుర్గాప్రసాద్,కోడేపాక శ్రీకాంత్, పోగుల రాజు కుమార్, ఎర్ర కుమార్, జన్ను అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.

### రామగుండం పోలీస్ కమీషనరెట్ పోలీస్ ఏర్పాట్ చేసిన

## స్టాల్ను సదర్శించిన సీఎం రేవంత్ రెడ్డి.....




రామగుండం /డిసెంబర్ 04(జనం రిపోర్టర్): పెద్దపల్లి తెలంగాణ రాష్ట్రం లో మొదటసారిగా రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో "పల్లె నిద్ర" కార్యక్రమం నిర్వహిస్తూ, ప్రజలతో మమేకం అవుతూ ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలు తెలుసుకొని చట్టపరిధి లో పరిష్కారం చేస్తున్న వివరాలు, తీసుకొంటున్న చర్యలు వివరించారు. "ఆపరేషన్ గరుడ" పేరుతో నేర, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణ కోసం "ఆపరేషన్ గరుడ" ప్రారంభం చేసి డ్రోన్ లతో పట్టణం లో పెట్రోలింగ్ నిర్వహిస్తు అసాంఘీక శక్తుల నిర్మూలనకు, నేరాల నియంత్రణ, ప్రజల భద్రత, లా అండ్ ఆర్డర్ దృష్ట్యా ప్రయోగాత్మకంగా ఆపరేషన్ గరుడ మొదలు పెట్టమని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ తెలియజేశారు. "గంజాయి" నియంత్రణ కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వము తీసుకుంటున్న చర్యలలో భాగంగా గంజాయి కేసులలో ఉన్నటువంటి నేరస్తులపై నిరంతర నిఘా ఉంచి గంజాయి అనేది పూర్తి స్థాయిలో నిర్మూలన చేయడంలో భాగంగా ప్రత్యేక నిఘాతో పాటు, గతంలో ఎన్డీపీఎస్ కేసుల్లో ఉన్న నేరస్థుల కదలికలను గమనిస్తూ ప్రత్యేక బృందం ఎప్పుడు ఉంటుందన్నారు. ఒకవేళ ఎవరైనా తిరిగి తమ నేర ప్రవృత్తిని మార్చుకోక మరల ఇలాంటి నేరాలు చేసినచో వారి పై పైల్ ఇంటిగ్రిటీ టెస్టర్ నార్కోటిక్స్ డ్రగ్స్ %ఆ% సైకోట్రోపిక్ పదార్థాల చట్టం పి.డి.యాక్టు కేసు నమోదు చేసి జైలుకు పంపడం సాధారణ పి.డి.యాక్టు అమలు గంజాయి రవాణా, అమ్మకాలు వినియోగం జరుగకుండా కేసుల నమోదు తీసుకుంటున్న పటిష్టమైన చర్యలు రామగుండం పోలీస్ కమీషనరేట్ లో "షీ టీమ్" ద్వారా తీసుకుంటున్న రక్షణ చర్యలు, అవగాహనా కార్యక్రమాలు, డెకొయ్ ఆపరేషన్ లు నమోదు చేసిన కేసుల గురించి సి ఎం.కు సీపీ వివరించారు.

## క్రీడాకారులకు హోం మంత్రి సర్టిఫికెట్లు ప్రధానం..



పొన్నూరు డిసెంబర్ 4 జనం రిపోర్టర్: రాష్ట్ర హోమ్ మినిస్టర్ వంగలపూడి అనితను హోం శాఖ కార్యాలయంలో పొన్నూరు సెయింట్ థామస్ కేరళ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఫెన్సింగ్ క్రీడలో జాతీయ స్థాయికి ఎంపికైన హదస జాస్మిన్, రాష్ట్ర స్థాయిలో మెడల్స్ సాధించిన వివేక రాజుకి ఆమె శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. మాజీ డిఐ జి సి హెచ్ రమేష్ బాబు, పాఠశాల పిడి అర్జునరావు పాల్గొన్నారు.

## పసల్ బీమా యోజన పథకంతో రై తు లకు ప్రయోజనం




రేపల్లె డిసెంబర్4 జనం రిపోర్టర్ : రైతులు 2024 2025 సంవత్సరానికి గాను బీమా సౌకర్యం పొందేందుకు తగిన డాక్యుమెంట్లను పొందుపరచాలని వ్యవసాయ శాఖ అధికారి ఆర్ విజయబాబు తెలియజేశారు బుధవారం మండలంలోని కారుమూరు గ్రామంలో రైతులకు అసలు బీమా యోజన పర్యావరణ బీమా యోజన పొందేందుకు ప్రీమియం చెల్లించి ఆ కాపీలను వ్యవసాయ శాఖ అధికారి కి అందజేయాలని సూచించారు రైతు సేవ కేంద్రం ద్వారా రైతులు మొక్కజొన్న పంటకు 105 రూపాయలు తెల్లదొంగ పంటకు 38 రూపాయలు పెసర పంటకు 36 రూపాయలు 60 రూపాయలు మెనూ పంటకు 60 రూపాయలు చెల్లించాలని తెలియజేశారు ఈ అవకాశాన్ని రైతుల సద్వినియోగం చేసుకోవాలన్నారు ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు నష్టపరిహారం చెల్లించేందుకు ఈ పథకాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన తెలియజేశారు

# అదానీ వ్యవహారంపై జెపిసి విచారణ

## ఇండియా బ్లాక్ నేతల డిమాండ్




న్యూఢిల్లీ : సౌర విద్యుత్ ప్రాజెక్టు కోసం భారత్‌లోని వివిధ రాష్ట్రాల్లోని ప్రభుత్వ పెద్దలకు అదానీ గ్రూపు భారీగా ముడుపులు ముట్టజెప్పిందని అమెరికా కోర్టులో కేసు నమోదైంది. అదానీ వ్యవహారంపై గత ఆరు రోజులుగా పార్లమెంటు ఉభయ సభలు దద్దరిల్లుతున్నాయి. ప్రతిపక్షపార్టీ ఎంపీలు అదానీ వ్యవహారంపై నిగ్గుతేల్చాలని చర్చకు పట్టుబడుతున్నా.. కేంద్ర ప్రభుత్వం మాత్రం మొగ్గుచూపడం లేదు. ఈ నేపథ్యంలో మంగళవారం ఇండియా బ్లాక్ నేతలు పార్లమెంటు వెలుపల అదానీపై వచ్చిన ఆరోపణలపై జెపిసి (జాయింట్ పార్లమెంటరీ కమిటీ) చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ నిరసన చేశారు. లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీతోపాటు, పలువురు పార్టీ నేతల ఎంపీలు మోడీ అదానీలు ఇద్దరూ ఒక్కటే ( 'మోడీ -అదానీ ఆర్ వన్!) అని రాసిన బ్యానర్‌ను పట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ నిరసన తెలిపిన ఫొటోలను ఫేస్‌బుక్‌లో పోస్టు చేసి.. 'కోట్లాది అదానీల నుండి ఎవరు ప్రయోజనం పొందుతారు? మోడీజీ' అన్ని ప్రశ్నిస్తూ నిరసన చేస్తున్నారు' అని రాసుకొచ్చారు. కాగా, ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ మీడియాతో మాట్లాడుతూ.. 'మోడీ ప్రభుత్వ పాలనకు అదానీ వ్యవహారం ఓ స్పష్టమైన సంకేతం. వారి విధానాలకు దేశవ్యాప్తంగా వ్యతిరేకత వచ్చింది. ఏది ఏమైనా అదానీ అభియోగాలపై ప్రభుత్వం స్పందించాలని ఈరోజు పార్లమెంటు సమావేశాలకు వెళ్లబోయే ముందే మేము నిరసన చేశాము' అని ఆయన అన్నారు. ఇక 'అదానీ కుంభకోణం, మణిపూర్, సంభాల్ వంటి ఘటనలపై సభలో చర్చ జరగాలని పట్టుబట్టాం. దానికోసం 267 నోటీసులు ఇచ్చాము. ప్రజా సమస్యలపై చర్చించేందుకు మా ప్రయత్నాలు మేం చేశాం. కానీ సభ జరగడం లేదు. అందుకే ప్రజానుకూల సమస్యలను లేవనెత్తడానికి మేము నిరసన చేశాము' అని సిపిఐ ఎంపి పి సంతోష్‌కుమార్ మీడియాకు తెలిపారు.

## తుఫాను బాధితులను ఆదుకుంటాం : స్టాలిన్‌కు మోడీ ఫోన్



న్యూఢిల్లీ : ఫెంగల్ తుఫాను తమిళనాడుని అతలాకుతలం చేసింది. ఈ తుఫాను వల్ల 14 జిల్లాల్లో 1.5 కోట్ల మంది ప్రజలపై ప్రభావం చూపిందని, 2.11 లక్షల హెక్టార్లలో పంట నష్టం జరిగిందని, మౌలిక వసతులు పూర్తిగా దెబ్బతిన్నాయని వీటి పునరుద్ధరణకు పునరావాసాల పనుల కోసం నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎన్‌డిఆర్‌ఎఫ్) నుండి రెండు వేల కోట్ల రూపాయలను విడుదల చేయాలని ప్రధాని నరేంద్ర మోడీని తమిళనాడు సిఎం స్టాలిన్ కోరారు. ఆయన మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ తుఫాను వల్ల జరిగిన నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయడానికి కేంద్ర బృందాన్ని నియమించాలని స్టాలిన్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం తమిళనాడు సిఎం ఎం.కె స్టాలిన్‌కు ఫోన్ చేశారు. ఫెంగల్ తుఫాను వల్ల నష్టపోయిన తమిళనాడుకు అన్నివిధాలా సాయం అందిస్తామని మోడీ స్టాలిన్‌కు హామీ ఇచ్చారు. కాగా, భారీ వర్షాల కారణంగా తమిళనాడులోని నీలగిరి జిల్లాలోని అన్ని పాఠశాలనను మూసివేస్తున్నట్లు ఆ జిల్లా మెజిస్ట్రేట్ లక్ష్మీ భవ్య మంగళవారం తెలిపారు.

## రాజీ ఎలా చేసుకున్నారు

## హోంమంత్రి అనితపై చెక్‌బౌన్స్ కేసులో హైకోర్టు




అమరావతి : తనపై నమోదైన చెక్‌బౌన్స్ కేసులో ఇరుపక్షాల మధ్య రాజీ కుదిరిందని హైకోర్టును హోంమంత్రి వంగలపూడి అనిత ఆశ్రయించారు. ఫిర్యాదుదారు, తన మధ్య రాజీ కుదిరిన నేపథ్యంలో విశాఖలోని 7వ స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టులోని కేసును కొట్టేయాలని ఆమె కోరారు. ఏ విధంగా రాజీ చేసుకున్నారో వివరించకపోవడాన్ని హైకోర్టు ఆక్షేపించింది. అనిత తనకు ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వలేదంటూ కింది కోర్టులో ఫిర్యాదు దాఖలు చేసిన వేగి శ్రీనివాసరావుతో స్వయంగా మాట్లాడింది. ఎంత మొత్తానికి రాజీ కుదిరిందో ఆరా తీసింది. కింది కోర్టులో తప్పుడు కేసు వేశారనే అభియోగాల మాటేమిటని ప్రశ్నించింది. కింది కోర్టులోని కేసును ఏం చేస్తారని కూడా ప్రశ్నించింది. దీనిపై శ్రీనివాసరావు.. తాను అనితపై తప్పుడు కేసు పెట్టలేదని, డబ్బు కోసం తిరగలేక రాజీ చేసుకున్నట్లు చెప్పారు. అనిత తరపున న్యాయవాది సతీష్ కల్పించుకుని రాజీ జరిగినందున శ్రీనివాసరావు తనపై దాఖలు చేసిన చెక్‌బౌన్స్ కేసును కింది కోర్టులో కొనసాగించరాదన్నారు. దీనిపై హైకోర్టు.. ఇదెలా రాజీ అవుతుందని, పోరాటం చేయకపోవడం వల్ల రాజీ చేసుకోవడం ఎలా అవుతుందని కూడా ప్రశ్నించింది. రాజీని రికార్డ్ చేయడానికి వీలుగా అన్ని వివరాలు తమకు నివేదించాలని అనితను ఆదేశించింది. ఈ నెల 10న జరిగే విచారణకు శ్రీనివాస్‌రావు ఆన్‌లైన్ ద్వారా హాజరయ్యేందుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ సోమవారం ఆదేశించారు. అనిత 2015 అక్టోబరు ఒకటిన వేగి శ్రీనివాసరావు నుంచి ఎన్నికల ఖర్చుల నిమిత్తం రూ.70 లక్షలు అప్పు తీసుకున్నారు. ఆ మొత్తం తీర్చకపోవడంతో 2018లో అనితపై శ్రీనివాసరావు సూట్ వేశారు. ఇటీవల అనిత హోంమంత్రి అయ్యారు. ఇరుపక్షాల మధ్య రాజీ కుదిరిందని ఆమె హైకోర్టును ఆశ్రయించారు.

## ఫోన్‌ట్యాపింగ్ ఆరోపణలు..హరీశ్‌రావుపై కేసు నమోదు



హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ కీలక నేత హరీశ్‌రావుపై మంగళవారం(డిసెంబర్3) కేసు నమోదైంది. తన ఫోన్ ట్యాప్ చేశారని బాచుపల్లికి చెందిన చక్రధర్‌గౌడ్ హరీశ్‌రావుపై పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పంజాగుట్ట పోలీసులు హరీశ్‌రావుపై 120బి,386,409 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో హరీశ్‌రావుతో పాటు టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావును కూడా పోలీసులు చేర్చడం గమనార్హం. కాగా, ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన ఫోన్‌ట్యాపింగ్ కేసు విచారణలో ఉంది. బీఆర్‌ఎస్ హయాంలో టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసిన పలువురు పోలీసు అధికారులను ఈ కేసులో అరెస్టు చేశారు. ఇటీవలే ఈ కేసులో బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను కూడా పోలీసులు విచారించారు. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ కీలకనేత హరీశ్‌రావుపై ఫోన్‌ట్యాపింగ్ ఆరోపణలపై మరో కేసు నమోదు చేయడం చర్చనీయాంశమైంది.

# మోడీ మౌనం వీడాలి

## ప్రభుత్వం చర్చ నుంచి పారిపోతోంది

## పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళన

## ఉభయ సభలు వాయిదా

## లోక్‌సభలో కోస్టల్ షిప్పింగ్ బిల్లు

అదానీ ముడుపుల వ్యవహారంపై ప్రధాని మోడీ మౌనం వీడాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అదానీ గ్రూప్ లంచంపై చర్చించాలని, ఈ అంశంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు ఆందోళన చేయడంతో పార్లమెంట్ ఉభయ సభలు దద్దరిల్లాయి. ప్రభుత్వం చర్చకు ముందుకు రాకపోవడంతో పార్లమెంట్ ఉభయ సభలు వాయిదాల పర్వంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. నిమిషాల్లోనే లోక్‌సభ, రాజ్యసభ మంగళవారానికి వాయిదా పడ్డాయి. తొలుత లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు నిర్వహించేందుకు ప్రయత్నించారు. దీంతో ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టారు. అదానీ అంశంపై ప్రధాని స్పందించాలంటూ నినాదాలను హోరెత్తించారు. ఈ ఆందోళనల మధ్యే కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ కోస్టల్ షిప్పింగ్ బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం సభను వాయిదా వేశారు.

న్యూఢిల్లీ-ఇటు లోక్‌సభ, అటు రాజ్యసభలోనూ ప్రతిపక్షాలు పట్టువీడటంలేదు. అదానీ ముడుపుల వ్యవహారంలో కేంద్రం వైఖరి తెలియజేయాలంటూ ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. సోమవారం లోక్‌సభలో ప్రతిపక్షాల ఆందోళనను హైజాక్ చేసేలా.. స్పీకర్ ఓం బిర్లా వ్యవహరించారు. ఎలాగైనా ఓ ప్రశ్న అడిగేందుకు అనంతపురం ఎంపీ అంబికా జి.లక్ష్మినారాయణను స్పీకర్ పిలిచారు. ఆయన ప్రశ్నకు కేంద్ర స్కిల్ మంత్రి జయంతి చౌదరి సమాధానం చెప్పారు. వెంటనే లక్ష్మినారాయణ సప్లిమెంటరీ ప్రశ్న అడిగారు. దానికి సమాధానం చెప్పిన తరువాత, సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలోనూ ప్రతిపక్షాలు తమ ఆందోళన కొనసాగించాయి. మరోవైపు రాజ్యసభలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. చైర్మన్ జగదీప్ ధన్కర్ సభను ప్రారంభిస్తూ ప్రతిపక్ష సభ్యులు ఇచ్చిన 20 వాయిదా తీర్మాన నోటీసులను తిరస్కరించారు. మధ్యాహ్నం 12 గంటలకు సభను వాయిదా వేసిన ఆయన తిరిగి ప్రారంభమెన రెండు నిమిషాల్లోనే సభను మంగళవారానికి వాయిదా వేశారు. నాలుగు రోజుల్లో కేవలం 54 నిమిషాలు లోక్‌సభ, 75 నిమిషాలు రాజ్యసభ కార్యకలాపాలు జరిగాయి. గత సోమవారం కేవలం ఆరు నిమిషాల పాటే లోక్‌సభ కార్యకలాపాలు జరగగా, బుధ, గురువారాల్లో రోజుకు 14 నిమిషాలు, శుక్రవారం 20 నిమిషాల పాటు మాత్రమే సభ కొనసాగింది. రాజ్యసభలో గత సోమవారం 33 నిమిషాలు కార్యకలాపాలు జరుగగా, బుధవారం 13 నిమిషాలు, గురువారం 16 నిమిషాలు, శుక్రవారం 13 నిమిషాల పాటే సభ జరిగింది.



### చర్చ నుంచి ప్రభుత్వం పారిపోతోంది : ప్రతిపక్షాలు

అమెరికా కోర్టులో గౌతమ్ అదానీపై చార్జిషీట్, సంభాల్ హింసతో సహా పలు సమస్యలపై పార్లమెంటులో చర్చలు జరగకుండా ప్రభుత్వం తప్పించుకుంటుందని ప్రతిపక్షాలు విమర్శించాయి. అదానీ, మణిపూర్, సంభాల్, అజ్మీర్‌లపై తక్షణ చర్చకు ఇండియా బ్లాక్ పార్టీలు నోటీసులు ఇచ్చాయని, కానీ మోడీ ప్రభుత్వానికి పార్లమెంటు పని చేయడం ఇష్టం లేదని ఆరోపణలు చేశాయి. అందుకే చర్చకు అంగీకరించటం లేదని పేర్కొన్నాయి. "ఈ పరిస్థితి నిజంగా అసాధారణమైనది. ప్రతిపక్షం చర్చను కోరుతోంది. కానీ ప్రభుత్వం దాని నుంచి పారిపోతోంది" అని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ అన్నారు. నవంబర్ 26న రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏండ్లు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగంపై రెండ్రోజుల పాటు చర్చ జరగాలని ప్రతిపక్ష ఇండి యా బ్లాక్ పార్టీలు కూడా కోరుతున్నాయని ఆయన అన్నారు. ఈ చర్చకు సంబంధించిన తేదీలను మోడీ ప్రభుత్వం ఇంకా ప్రకటించలేదని పేర్కొన్నారు.

### పార్లమెంటరీ ప్రతిష్టంభన ముగింపునకు అంగీకారం

### పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు

పార్లమెంటరీ ప్రతిష్టంభన ముగింపునకు ప్రభుత్వం, ప్రతిపక్షాలూ అంగీకరించాయి. ఉభయ సభల్లో రాజ్యాంగంపై చర్చకు అంగీకరించాయి. నవంబర్ 25న శీతాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి అదానీ, సంభాల్ హింసాకాండ, మణిపూర్‌లో అశాంతి వంటి విషయాలపై ప్రతిపక్షాల నిరసనల ఫలితంగా లోక్‌సభ, రాజ్యసభలు నిరంతరం వాయిదా పడుతూ వస్తోన్నాయి. మంగళవారం నుంచి లోక్‌సభ, రాజ్యసభలు సజావుగా సాగుతాయని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు విశ్వాసం వ్యక్తం చేశారు. పార్లమెంటరీ ప్రతిష్టంభనను తొలగించేందుకు అధికార బీజేపీ, ప్రతిపక్ష పార్టీలు సోమవారం ఒక ఒప్పందానికి వచ్చినట్టు తెలిసింది. పార్టీల ఫ్లోర్ లీడర్లతో స్పీకర్ ఓం బిర్లా సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన కిరెణ్ రిజిజు విలేకరులతో మాట్లాడుతూ డిసెంబర్ 13, 14 తేదీల్లో లోక్‌సభలో రాజ్యాంగంపై చర్చను, డిసెంబర్ 16, 17 తేదీల్లో రాజ్యసభలో చర్చ జరుగుతుందని చెప్పారు. రాజ్యాంగ సభ రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏండ్లు పూర్తయిన సందర్భంగా పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చలు జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. మంగళవారం నుంచి పార్లమెంట్ సజావుగా సాగుతుందని రిజిజు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి హాజరైన పలువురు ప్రతిపక్ష నేతలు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

# 'కులగణనపై ఈయనకు గుర్రెందుకు

మాజీ డీజీపీ అరవిందరావు నవంబర్ 23న ఆంధ్రజ్యోతి దినపత్రికలో కులగణనను వ్యతిరేకిస్తూ ఒక వ్యాసం రాశారు. కులగణన చేయడం భారతీయ సమాజాన్ని విడగొట్టే కుట్రగా చెప్పారు. ఇది బ్రిటీషు పాలకులు భారతీయ సమాజాన్ని విభజించే ఎజెండాతో అనుసరించిన పంథా అని అన్నారు. అలాంటి పరిస్థితి రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని, కులగణన జరిగితే సమాజంలో అల్లకల్లోలం ఏర్పడుతుందని, దాన్ని పోలీసులుగాని, ఆర్మీగాని అదుపు చేయలేరని ఆందోళన పడ్డారు. తన వాదనను సమర్థించు కోవడానికి అవాస్తవాలు చెప్పారు,వక్రీకరణలు జోడించారు. నిజానికి ఈ దేశ మూలవాసులకి అసలైన మొదటి శత్రువులు నాడు పశ్చిమాసియా నుండి వచ్చిన ఆర్యులే. ఆ తర్వాతనే మరేవరైనా కావొచ్చు. అరవిందరావు వర్ణవ్యవస్థ అనాదిగా ఉందని, అదేమి భారతదేశ ప్రత్యేకత కాదని, ఇలాంటి వ్యవస్థలు ప్రపంచమంతా వున్నాయన్నారు. ఆయన చెప్పింది పాక్షిక సత్యమే. బ్రిటీషువారు వచ్చాకే భారతదేశంలో వర్ణవ్యవస్థ ఉనికిలోకి వచ్చిందనడం, వారొచ్చిన తర్వాతనే దేశంలో విచ్ఛన్నకర పరిస్థితులు దాపురించాయనడం, అస్పృశ్యత బ్రిటీష్ వారు రాకముందు లేదనడం, అమాయకత్వం లేదా తెలివితక్కువతనం లేదా మోసకారితనం అవుతుంది. బ్రిటీషు వారికి నల్ల జాతీయులంటే చులకన భావన ఉంది. దేశ సంపద కొల్లగొట్టారు. ఉద్యమాలను అణచివేశారు. కాని వారి కాలంలో తమ అవసరార్థం ఈ దేశ ప్రజలకు ఉపయోగపడే సంస్క రణలు అనేకం చ్ఛేశారన్నది వాస్తవం. వేల ఏండ్లుగా సాగుతున్న బ్రహ్మణిజాన్ని దాని ఆధిపత్యాన్ని దెబ్బతీసే విధంగా మూఢచారాలను నిషేధించారు. "సతీసహగమనం" రద్దు చేశారు. వర్ణాశ్రమ ధర్మానికి భిన్నంగా విద్య ప్రజలందరికి అందించే ప్రయత్నం చేశారు. విద్య అంటే మత గ్రంథాలు, పురాణాలు వల్లె వేయడం కాదని లోకజ్ఞానాన్ని పెంచే లెక్కలు, సైన్సు, చరిత్ర, భూగోళం, సామాజిక శాస్త్రం వంటివని వాటిని భోదనాంశాలుగా చేశారు. ఫలితంగానే పూలే, పెరియార్, అంబేద్కర్ లాంటి మహనీయులు నాటి భారతీయ సమాజం నుండి తయారయ్యారు. వారికి సేవకులను తయారు చేసుకోవడమూ అందులో ఇమిడి ఉంది. అది వేరే విషయం. అరవిందరావు కులవ్యవస్థ ఇస్లాం వచ్చాకో, క్రైస్తవం అవతరించాకో ప్రారంభమయినట్లు చెప్పడం మోసకారితనమ వుతుంది. ఈ విషయమై స్వామి వివేకానంద ఏమి చెప్పారో చూడండి. "అస్పృశ్యులు అనబడే ప్రజలను ఈనాటి అధ్వాన్న స్థితికి దిగజార్చింది ఎవరు? ఎవరు దీనికి బాధ్యులు? దీనికి ఆంగ్లేయులు మాత్రం కారణం కాదు. అనేక పారమార్థిక, వ్యవహారిక సిద్ధాంతాలను కనిపెట్టిన హిందూమతంలోని కుటిలులే ఇందుకు కారణం" అని స్పష్టంగా చెప్పారు. రామకృష్ణ మఠం ప్రచురించిన "స్వామి వివేకానంద" పుస్తకంలోని పదహారో పేజీలో ఈ విషయం స్పష్టంగా ఉంది. స్వామి వివేకానంద చెప్పిందైనా అరవిందరావు పరిగణలోకి తీసుకొని ఉంటే బావుండేది. వర్ణవ్యవస్థగా చెప్పబడేది కేవలం సమాజ అవసరాల కోసం, సౌలభ్యం కోసం ఏర్పడ్డ వృత్తుల విభజన మాత్రమే, ఆ వృత్తులు వంశ పారంపర్యం కాదు. అక్కడ ఉచ్చం, నీచం, అంటరానితనం అంటూ తారతమ్యాలు లేవు. ఒక వృత్తి నుండి మరే వృత్తికైనా మారే స్వేచ్ఛ వుండేది. ఎలాంటి వివక్షలు లేవని ఆయన వాదన. ఆయన నిజంగానే ఆ వాదనను నమ్మేవారయితే మనుస్మృతిని రామాయణ, మహాభారతంలో వర్ణవ్యవస్థకు అనుకూలంగా ఉన్న అంశాలను ఖండ ఖండాలుగా చీల్చి చెండాడేవారు. కానీ, మన సమాజంలోని వర్ణ కుల వ్యవస్థకు గ్రీస్ మరికొన్ని ప్రాచీన నాగరిక దేశాలకు చెందిన బానిస వ్యవస్థలకు మౌలిక తేడాలున్నవి. రెండింటిలో దోపిడీ చేసే వారికి దోపిడీ చేయబడే వారికి మధ్య వైరుధ్యమే ప్రధానమైనది. అయితే ప్రధాన తేడా ఏమిటంటే అక్కడ బాని సల పేరిట దోపిడీ చేసేవారు. ఇక్కడ వర్ణం, కులం ముసుగులో దోపిడీ కొనసాగింది. ఈ వ్యవస్థలను నిలబెట్టడానికి, దీర్ఘకాలిక ప్రయోజనాలను బలపర్చు కోవడానికి ఒక సైద్ధాంతిక, తాత్విక మత చట్రం, నిర్మితమైనది. బయటి ప్రపంచ దేశాలలో కులవివక్ష, అంటరానితనం, మైల సిద్ధాంతం వగైరాల్లేవు. ఆర్థిక అవసరాల కోసం ఏర్పాటు చేసుకున్న తత్కాలిక నిర్బంధ చట్టాలవి. దేవుడే అసమానతలు సృష్టించాడని, దేవుడి నోటి నుండి, బ్రాహ్మణులు బాహువుల నుండి క్షత్రియులు, తొడల నుండి వైశ్యులు, పాదాల నుండి శూద్రులు పుట్టారని, హిందువులు పవిత్రంగా భావించే




గ్రంథాలన్నీ చెపుతాయి. శూద్రుల పట్ల వివక్ష పాటించాలని, దళితులను అంటరానివారిగా చూడాలని, మహిళలను అణిచి ఉంచాలని చెపుతాయి. ఇతర వ్యవస్థల్లో ఇది మనకు కనపడదు. కానీ అరవిందరావు రెంటిని ఒకే గాట కట్టి మాయ చేస్తున్నారు. యూరప్‌లో కూడా కులవ్యవస్థ ఉన్నట్లు, అది పారిశ్రామిక విప్లవం ద్వారా అంతమయినట్లు ఆధారం లేని వాదనలు చేస్తున్నారు. ఇంగ్లీషు వారు రాకపోతే మన దేశంలోనూ పారిశ్రామిక విప్లవం వచ్చి కులవ్యవస్థ పటాపంచలయ్యేదని అన్నారు. వారు చెప్పిన మరో అవాస్తవం ఏమిటంటే, హిందుమత గ్రంథాలు కులవ్యవస్థకు మూలమైన వర్ణవ్యవస్థ భారతీయ సమాజానికి ఏ నష్టం చేయలేదన్నది. పైగా లాభమే చేసిందని వాధిస్తున్నారు. కులగణన ద్వారా ప్రస్తుత ఆధిపత్య వర్ణాలకు ప్రయోజనకారిగా వున్న వర్ణ, కులవ్యవస్థలు నిర్వీర్యమవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో బ్రాహ్మణ, క్షత్రియులకు ఎలాంటి ఇబ్బందులు లేవు. చదువు, సంపదలు కింది కులాలకు నిషేధించి తాము సమాజంపై పెత్తనం చేస్తూ సుఖ, సౌఖ్యాలు అనుభవించారు. ఇప్పటికి అనుభవి స్తున్నారు. వారు ఈ సౌకర్యాలు కొనసాగాలనుకోవడం సహజం. మన సమాజంలో కులం కొందరికి వరమైతే, కోట్లాను కోట్లమందికి శాపంలా దాపురించింది. సంపన్నులంతా ఎక్కువగా అగ్రకులాల నుండే వున్నారు. పేదలంతా దాదాపు ఎస్సీ, ఎస్టీ, బీసి కులాల నుండే వున్నారు. కులం ప్రభావితం చేయని రంగమంటూ లేదు. ఒక ఉదాహరణ చూస్తే ఇదెంత వాస్తవమో గమనించవచ్చు. ఈ ఏడాది జూన్ 30న దినపత్రికలలో ఈ వార్త వచ్చింది. ప్రపంచ అసమానతల నివేదిక వారు బహిర్గత పర్చారు. భారతదేశంలోని శతకోటీశ్వరులలో 88శాతం అగ్రకులస్తులే. జనాభాలో 15శాతం కూడా లేని అగ్రకులాలకు చెందినవారే సంపన్నుల్లో 88శాతం వున్నారు. మిగతా కులాలన్నింటి నుండి కేవలం 12శాతం మాత్రమే. ఇదే పరిస్థితి, రాజకీయ, న్యాయవ్యవస్థ, బ్యూరోక్రసి, మీడియా అధిపతుల్లోనూ కనిపిస్తుంది. గత మూడు, నాలుగు తరాల నుండి బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలకు వారు చదువుకొని విజ్ఞాన వంతులవుతున్నారు. ఆర్థికంగా మధ్య తరగతి వర్గాలలోకి చేరగలుగుతున్నారు. చైతన్యవంతులు కాగలుగుతున్నారు. తరతరాలుగా తమ పూర్వీకులకు జరిగిన అన్యాయాలు గుర్తిస్తున్నారు. ఇప్పటికీ తాము అన్నిరంగాల్లో వెనుకబడిన విషయా

# అధిక వాటా సమంజసమా..



మన దేశం అనాదిగా నిచ్చెన మెట్ల కుల వ్యవస్థలో కూరుకుపోయింది. అయితే, ఈ వ్యవస్థలో దళితులను అట్టడుగు స్థానంలో ఉంచడం దారుణం. తద్వారా దళితవర్గాలు వేల ఏండ్ల నుంచి సామాజిక హక్కులకు నోచుకోక.. అస్పృశ్యత, అంటరానితనాన్ని అనుభవించారు. అందుకే, వారి అభ్యున్నతి కోసం అంబేద్కర్ నాడు రాజ్యాంగంలో 15 శాతం రిజర్వేషన్లు కల్పించారు. షెడ్యూల్డ్ కులాల్లో 59 ఉపకులాలు ఉండగా.. ప్రధానంగా మాదిగ, మాలలు అత్యధికంగా ఉన్నారు. అయితే, వారిలో జనాభాపరంగా అత్యధికంగా ఉండి, వెనుకబడిన కులం మాదిగ. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో మాదిగలను పలు రకాల పేర్లతో పిలుస్తారు. ఉమ్మడి ఏపీలో మాలలతో పోలిస్తే మాదిగలే అత్యధికులు. కానీ, వారు విద్య, ఉద్యోగ, రాజకీయపరంగా వెనుకబడ్డారు. మెజారిటీలైన మాదిగ కులానికి రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లలో తగిన వాటా దక్కకపోవడమే అందుకు ప్రధాన కారణం. ఈ విషయాన్నీ పలు కమిషన్లు కూడా ధృవీకరించాయి. దళిత సామాజికవర్గంలోని మాల, మాదిగ వర్గాల నడుమ అసమానతల కారణంగా ఈ రెండింటి మధ్య వైరుధ్యం పెరిగింది. ఈ నేపథ్యంలోనే మందకృష్ణ మాదిగ, తదితర మాదిగ మేధావుల నేతృత్వంలో 1994న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఏర్పడింది. దీని ఆధ్వర్యంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఉద్యమం మొదలైంది. దీంతో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 1996లో వర్గీకరణ అంశంపై జస్టిస్ పి.రామచంద్రమూర్తి కమిషన్‌ను నియమించారు. వెనకబాటుతనం ఆధారంగా షెడ్యూల్డ్ కులాలను ఏ, బీ, సీ, డీ అనే నాలుగు వర్గాలుగా వర్గీకరణ చేయాలని ఈ కమిషన్ సిఫారసు చేసింది. అంతేకాదు, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను విద్య, ఉద్యోగాల్లో వర్తింపజేయాలని సూచించింది. ఈ కమిషన్ నివేదిక మేరకు 2000 సంవత్సరం నుంచి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను అమలుపరిచారు. దీని ప్రకారం బీ వర్గంలో ఉన్న మాదిగలకు 7 శాతం, సీ వర్గంలో ఉన్న మాలలకు 6 శాతం, ఇతర ఉపకులాలకు మిగతా శాతాన్ని వర్తింపజేశారు. దీంతో కొంతవరకు మాదిగలకు విద్య, ఉద్యోగాల్లో లబ్ధి చేకూరింది. అయితే, ఎస్సీ కులాల్లో సామాజిక సమానత్వం కోసం అమలుపరిచిన ఉప వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాల సోదరులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో ఉమ్మడి ఏపీలో అమల్లో ఉన్న ఎస్సీ ఉప వర్గీకరణను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఇదే ఈవీ చెన్నయ్య వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా-2004 కేసుగా పేర్కొంటారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మాదిగ ఉప కులాలు నిరసన వ్యక్తం చేసి, వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చాయి. దీంతో 2007లో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఉషా మెహ్రా కమిషన్‌ను నియమించింది. రిజర్వేషన్ల వర్గీకరణ అవసరమని ఈ కమిషన్ కూడా నొక్కిచెప్పింది. కానీ, ఓట్ల రాజకీయం కోసం ప్రభుత్వాలు ఇన్నాళ్లు దాటవేశాయి. ఇటీవల స్టేట్ ఆఫ్ పంజాబ్, ఇతరులు వర్సెస్ దేవీందర్‌సింగ్ కేసులో గతంలో ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించి 2024 ఆగస్టు 1న రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చని సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుతో 20 ఏండ్ల నిరీక్షణకు తెరపడింది. సుప్రీం కోర్టు తీర్పులో పలు విషయాలను ప్రస్తావించింది. ఎస్సీ కులాల్లో ఎక్కువ, తక్కువలున్నాయాని చెప్పింది. సామాజిక, ఆర్థిక స్థితిగతుల గణాంకాలను సేకరించి, వాటి ఆధారంగా వర్గీకరణ చేయాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ తీర్పు తర్వాత మాలల్లో అలజడి మొదలైంది. మాల, మాదిగ సోదరుల మధ్య విమర్శలు తీవ్రస్థాయికి చేరాయి. ఈ రెండు కులాల మధ్య వైషమ్యాలు మరింత పెరిగిపోతుండటం విచారకరం. ఈ విమర్శల పరంపరలో రాజకీయ నాయకులు భాగం కావడం ఆందోళనకరం. మాలలతో పోలిస్తే మాదిగలు వెనకబడ్డారనేది వాస్తవం. మాదిగలు ఇప్పటికీ పారిశుద్ధ్య కార్మికులుగా జీవిస్తున్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో మాదిగలు వెనుకబడ్డారు. వాస్తవానికి, ఏపీలో మాలల జనాభా ఎక్కువ. బ్రిటిష్ పరిపాలనలో ఆంధ్ర ఉన్న సమయంలోనే వీరు విద్య, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకున్నారు. నైజాం పాలనలో ఉన్న మాదిగలు మాత్రం చర్మకార వృత్తికే పరిమితమయ్యారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో మాదిగలు కన్నా తక్కువ సంఖ్యలో ఉన్న మాల సోదరులు రిజర్వేషన్లలో మెజారిటీ వాటాను కోరడం ఎంతవరకు సబబు? ఏండ్ల నుంచి అణచివేతకు గురైన జాతిగా మాదిగ సమాజం సామాజిక వివక్షను అనుభవిస్తున్నది. అణచివేతకు గురైన వర్గాన్ని, ఆధిపత్యం వర్గంతో సమానం చేయడానికే కదా రిజర్వేషన్లను అంబేద్కర్ కల్పించారు. ఈ క్రమంలో రిజర్వేషన్ ఫలాల్లో కూడా అసమాన పంపిణీ జరగడం వల్ల మరింత నష్టం చేకూరుతుంది. కాబట్టి, జనాభా ప్రాతిపదికన నిష్పక్షపాతంగా ఎస్సీ వర్గీకరణ చేయాల్సిన అవసరం ఉన్నది.

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

సంపాదకీయం

## కార్మికుల పెన్షన్ కార్పొరేట్ల పరం!

### (విశ్లేషణ)

ఇరవై ఐదు సంవత్సరాల పాటు ఒక ప్రభుత్వ రంగ పరిశ్రమలో పనిచేసి నెలకు ఏభై వేల రూపాయలకు పైగా జీతం పొందిన ఒక కార్మికుడు పదవీ విరమణ తర్వాత కేవలం రెండువేల రూపాయల లోపు మాత్రమే పెన్షన్ పొందడం...

కార్మికుల పెన్షన్ కార్పొరేట్ల పరం! ఇరవై ఐదు సంవత్సరాల పాటు ఒక ప్రభుత్వ రంగ పరిశ్రమలో పనిచేసి నెలకు ఏభై వేల రూపాయలకు పైగా జీతం పొందిన ఒక కార్మికుడు పదవీ విరమణ తర్వాత కేవలం రెండువేల రూపాయల లోపు మాత్రమే పెన్షన్ పొందడం నమ్మశక్యం కాని విషయం. కానీ ఇది వాస్తవం. ఇపిఎస్%-%95 పేరుతో దేశంలో ప్రవేశపెట్టిన పెన్షన్ పథకం కార్మికుల పొదుపు సొమ్మును హరించి కార్పొరేట్లకు ధారాదత్తం చేసే విధాన ఫలితం. మన దేశంలో కార్మికులకు ఉన్న హక్కులను ఒకటొకటిగా హరిస్తున్న వేళ విచిత్రంగా కేంద్ర ప్రభుత్వం కార్మికులు కోరకుండానే వారికి ఒక పెన్షన్ పథకాన్ని చాలా ఉదారంగా ప్రవేశపెట్టింది. కార్మికులు వద్దన్నా వినలేదు. కనీసం ఇందులో చేరాలా వద్దా అనే ఆప్షన్ ఇమ్మన్నా ఇవ్వలేదు. కార్మికులపై ఎందుకింత ప్రేమ అని కొద్దిగా పరిశీలిస్తే 1991 నుంచి దేశంలో అమలవుతున్న నయా ఉదారవాద విధానాలలో భాగమే ఈ పెన్షన్ పథకం అని సులువుగానే అర్థమవుతుంది. 1995లో నాటి పివి నరసింహారావు ప్రభుత్వం అప్పటివరకు అమలులో ఉన్న ఉద్యోగుల భవిష్య నిధి (పిఎఫ్) చట్టం 1952ను సవరించి, ఉద్యోగుల పెన్షన్ స్కీమ్ ఇపిఎస్%-%95 పేరున ఒక కొత్త చట్టాన్ని చేసింది. ఈ పెన్షన్ చట్టం ప్రకారం అప్పటివరకు కార్మికుల భవిష్యనిధిలో ఉన్న యాజమాన్యం వాటా భాగం 8.33శాతం, ప్రభుత్వ వాటా 1.16 శాతం ఈ పెన్షన్ నిధికి మళ్ళించబడుతుంది. ఈ నిధి నుండి ప్రతినెల పిఎఫ్ డిపార్టుమెంట్ పెన్షన్లు చెల్లిస్తుంది. ఈ పథకం వల్ల కార్మికులకు వచ్చే సంక్షేమం కంటే కార్మికులు పొదుపు సొమ్మును కోల్పోవడమే అధికంగా ఉంటుందని ఆనాడే కొన్ని కార్మిక సంఘాలు ముఖ్యంగా సిఐటియు వంటి కేంద్ర సంఘాలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి. కొన్ని యూనియన్లు దీనిపై దేశంలోని వివిధ రాష్ట్ర హైకోర్టులలో కేసులు కూడా వేశాయి. ఈ కేసులపై కొన్ని హైకోర్టులు ఈ పథకం అమలుపై స్టే ఉత్తర్వులు కూడా ఇచ్చాయి. ఈ కేసులన్నీ చివరకు సుప్రీంకోర్టుకు చేరాయి. దీనిని తరచూ సమీక్షిస్తూ ఉంటామని, పథకాన్ని మరింత పటిష్టపరుస్తామనే అనేక హామీలు ప్రభుత్వం ఇవ్వడంతో సుప్రీంకోర్టు ఈ పథకం అమలుకు అనుమతించింది. ఈ విధంగా కార్మికుల ఆమోదం లేకపోయినా, వివిధ యూనియన్లు ప్రతిఘటించినా ఈ పథకం 1995 నుండి అమలులోకి వచ్చింది. ఈ పెన్షన్ పథకం ప్రత్యేకత ఏమిటంటే దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఎల్ఐసి, బ్యాంకు ఉద్యోగులకు, ఇతర సంస్థలలో ఉన్న పెన్షన్ పథకాలలోని ఒక్క అనుకూల అంశం కూడా ఇందులో లేకపోవడమే. వీటికి భిన్నంగా ప్రతికూలంగా ఉండే అనేక అంశాలు ఈ పథకంలో ఉన్నాయి. ఉదాహరణకు మిగిలిన అన్ని పెన్షన్ పథకాలలో పెరిగిన ధరలకు అనుగుణంగా కరువు భత్యం ఉండగా ఈ పథకంలో అది లేదు. అన్ని పెన్షన్ పథకాల్లోనూ పదవీ విరమణ సమయంలో పెన్షన్‌లోని కొంత మొత్తాన్ని కమ్యూట్ చేసుకుని, ఒకేసారి పెద్ద మొత్తాన్ని తీసుకునే అవకాశం ఉండగా, ఈ పెన్షన్ పథకంలో మాత్రం ఆ సదుపాయం లేదు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఆఖరి నెల జీతం ఆధారంగా పెన్షన్ లెక్కిస్తే, ఈ పథకంలో మాత్రం కార్మికుని ఆఖరి అరవై నెలల జీతం సగటు తీసుకుని దాని ఆధారంగా పెన్షన్ లెక్కిస్తారు. అలాగే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 20 సంవత్సరాల సర్వీసు పూర్తయితే పూర్తి పెన్షన్ పొందడానికి అర్హత రాగా, ఇక్కడ మాత్రం 33 సంవత్సరాల సర్వీసుకు గాని ఆ అర్హత రాదు. ఇలాంటి అనేక లోపాల వల్ల పెన్షన్ చాలా తక్కువగా ఉంటోంది. పెన్షన్ పొందే జీతం పరిమితిని కూడా మొదట రూ.6,500గా నిర్ణయించారు. తరువాత దానిని రూ.15,000కు పెంచారు. పూర్తి జీతంపై హయ్యర్ పెన్షన్ అనుమతించాలని, సుప్రీంకోర్టు 2022 నవంబరులో తీర్పు ఇచ్చి రెండేళ్లు గడిచినా నేటికీ అమలు కాలేదు సరికదా ఈ పేరున పదిహేడున్నర లక్షల మంది పెన్షనర్ల నుండి రూ.1,86,920 కోట్లు వసూలు చేసి, ఆ సొమ్మును ప్రభుత్వం తొక్కిపెట్టింది. ఇది పచ్చి దగా. విచిత్రమేమిటంటే అనేక మందికి 100, 150, 200 రూపాయలు పెన్షన్ వచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి. పెద్ద ఎత్తున ఒత్తిడి రావడంతో చివరకు ప్రభుత్వం కనీస పెన్షన్‌ను వెయ్యి రూపాయలకు 2017లో పెంచింది. దీనివల్ల 36.4 లక్షల మంది లాభపడ్డారని ఘనంగా ప్రకటించుకుంది. కానీ దీన్ని బట్టే తెలుస్తున్నదేమిటంటే అంత మందికి అప్పటి వరకు వెయ్యి రూపాయల లోపే పెన్షన్ ఉందని. దీనికి ప్రభుత్వం సిగ్గు పడవలసింది పోయి, తిరిగి గొప్పలు చెప్పుకోవడం విడ్డూరమే. ఇప్పటికీ వెయ్యి రూపాయల లోపు పెన్షన్ వస్తున్నవారు కూడా ఉన్నారు. అత్యధికమందికి వచ్చే పెన్షన్ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న వృద్ధాప్య పెన్షన్ కంటే కూడా తక్కువగా ఉంటోంది. 2024లో ఈ పథకం ద్వారా 78.5 లక్షల మందికి పెన్షన్ చెల్లించారు. ఇందులో 46.6 శాతం మందికి వెయ్యి, అంతకంటే తక్కువబీ 85 శాతం మందికి రూ.2,500 లోపు మాత్రమే పెన్షన్ వస్తోందని వీరి గణాంకాలు తెలుపుతున్నాయి. ఐదు వేల రూపాయలకు పైగా పెన్షన్ పొందుతున్నవారు కేవలం 29,608 మందిబీ అంటే మొత్తం పెన్షన్ దారులలో కేవలం 0.37శాతం మంది. సగటు పెన్షన్ కేవలం రూ.1578 మాత్రమే. ఫలితంగా అనేకమంది పెన్షనర్లు కడు పేదరికంలో మగ్గుతున్నారు. అందువల్లే దీని కార్పస్ ఫండ్ 2018లో 4లక్షల 37వేల కోట్ల రూపాయల నుంచి 2024 నాటికి 8లక్షల 88వేల కోట్లకు అంటే ఆరేళ్ల కాలంలో ఏకంగా రెట్టింపుకు పైగా పెరిగింది. ఈ సొమ్మును ప్రభుత్వం మిగిలిన పిఎఫ్ నిధులతో పాటు, వివిధ సంస్థలలో పెట్టుబడులుగా పెడుతోంది. ఇలా కార్మికుల పొదుపు కార్పొరేట్ల పాలవుతోంది. కార్మికుల ఖాతా నుంచి ఈ పెన్షన్ నిధికి మళ్లిస్తున్న సొమ్ము ఎంత, దానిపై వచ్చే వడ్డీ ఎంత, కార్మికునికి పదవీ విరమణ తర్వాత ప్రభుత్వం చెల్లిస్తున్న పెన్షన్ ఎంత, అనే ఈ మూడు అంశాలను పరిశీలిస్తే చాలా ఆశ్చర్యకరమైన వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. ఇప్పుడు ఈ పెన్షన్ పొందే జీతం యొక్క గరిష్ఠ పరిమితి రూ.15వేలుగా ఉంది. అంటే కార్మికునికి రూ.15వేల జీతం నుండి ప్రతినెల 8.33శాతం చొప్పున పెన్షన్ ఫండ్‌కు అయ్యే జమ, ప్రభుత్వ వాటా 1.16శాతం కలిస్తే, ప్రతి నెల రూ.1420 చొప్పున 25 ఏళ్ల సర్వీసులో మొత్తం రూ.4,26,000. దీనిపై ప్రస్తుతం పిఎఫ్‌పై ఉన్న వడ్డీ రేటు 8.25 శాతం ఆధారంగా 25 ఏళ్ల చివరకు వచ్చే వడ్డీ రూ.10,25,725. అంటే%-% అసలు, వడ్డీ కలిపి మొత్తం రూ.14,51,725 అవుతుంది. దీనిపై ఇప్పుడు సీనియర్ సిటిజన్లకు బ్యాంకులలో ఉన్న వడ్డీ రేటు 8.4 శాతం రేటు చొప్పున నెలకు రూ.10,162 వడ్డీ వస్తుంది. కానీ నేడు ఇదే కార్మికుడికి ఈ పథకం ద్వారా వచ్చే గరిష్ఠ పెన్షన్ నెలకు కేవలం రూ.5,785 మాత్రమే. దీనర్థం ఏమిటంటే కార్మికుని పొదుపు సొమ్ముపై వచ్చే వడ్డీ కంటే కూడా తక్కువగా పెన్షన్ ఉంది. మరి అసలు పొదుపు సొమ్ము అంతా స్వాహా అవడం కాదా ఇది. దీనితో పాటు నాడు సుప్రీంకోర్టుకు ఇచ్చిన హామీలు కూడా ప్రభుత్వం అమలు చేయడం లేదు. సరికదా నాడున్న సౌకర్యాలనే కొన్నిటిని ఎత్తివేశారు. అందువల్ల దీన్ని కార్మికుల సంక్షేమం అనడం కంటే, కార్పొరేట్ల సంక్షేమ పథకం అనడం సబబుగా ఉంటుంది. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ పెద్దలు దీనిని సవరిస్తామని హామీ అయితే ఇచ్చారు కానీ, మూడోసారి అధికారం లోనికి వచ్చినా, ఇంకా నేటికీ కార్యరూపం దాల్చలేదు. ప్రభుత్వం కార్మికులకు ఉచితంగా దయాధర్మంగా ఏమీ పెన్షన్ ఇవ్వనవసరం లేదు. కార్మికుల పొదుపు సొమ్ము అయిన పెన్షన్ నిధి నుండే, అది కూడా దానిపై వచ్చే వడ్డీ నుండే వివిధ కార్మిక, పెన్షనర్ల సంఘాలు కోరుతున్నట్లుగా కనీస పెన్షన్ తొమ్మిది వేల రూపాయలకు పెంచడం, కరువు భత్యం చెల్లించడం, కమ్యూట్ చేసుకునే అవకాశం, ఐదేళ్లకు ఒకసారి పెన్షన్ సవరించడం వంటివి నిక్షేపంగా చేయవచ్చు. అయితే దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే నయా ఉదారవాద విధానాలను మరింత స్పీడుగా అమలు చేస్తున్న మోదీ ప్రభుత్వం అలా చేస్తుందా అన్నదే అసలు ప్రశ్న. దేశానికి అనేక విధాలుగా సేవలందించిన, ఈ సీనియర్ సిటిజన్ల పొదుపును దోచుకోవడమే కాక, వారి న్యాయమైన డిమాండ్లను సైతం నిర్లక్ష్యం చేయడం క్షంతవ్యం కాదు. ఈ పని చేయకుండా సీనియర్ సిటిజన్లకు ఏదో చేసేశామని గొప్పలు చెప్పుకోవడం సభ్యత అంతకంటే కాదు.

# సీఎం స్టాలిన్‌కు ప్రధాని మోడీ ఫోన్..

# అన్ని విధాల సహాయానికి హామీ!



'ఫంగల్' తుఫాను తమిళనాడులో భారీ విధ్వంసం సృష్టించింది. భారీ వర్షాలు, తుఫాను కారణంగా వరదలు రాష్ట్రంలో భారీ నష్టం కలిగించాయి. ఈ బీభత్సంలో చాలా మంది మరణించారు. రాష్ట్రంలో సంభవించిన విపత్తు, అక్కడి పరిస్థితులపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. రాష్ట్రానికి అన్ని విధాలా సాయం చేస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. మంగళవారం ముఖ్యమంత్రి స్టాలిన్‌తో ప్రధాని మోదీ మాట్లాడారని, రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వరదల పరిస్థితిపై సమాచారం అందుకున్నారని ప్రభుత్వానికి సంబంధించిన అధికారిక వర్గాలు తెలిపాయి. స్టాలిన్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

ఫెంగల్ తుఫాను భారీ విధ్వంసం:

తమిళనాడులోని ఉత్తర ప్రాంతంలోని విల్లుపురం జిల్లాలో సోమవారం భారీ నుంచి అతిభారీ వర్షాల కారణంగా అపూర్వమైన వరదలు సంభవించాయి. వంతెనలు, రోడ్లు నీటమునిగడంతో పలు గ్రామాలు, నివాస కాలనీలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేల ఎకరాల్లో వేసిన పంటలు కూడా నీట మునిగాయి. ఇదిలా ఉండగా, తిరువణ్ణామలైలో డిసెంబర్ 1 రాత్రి కురిసిన వర్షాల సమయంలో బురద జారడం, కొండపై నుండి పడిన రాయి కారణంగా ఐదు మృతి చెందారు. అంతకుముందు సోమవారం ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ, ఫెంగల్ తుఫాను రాష్ట్రంలో భారీ విధ్వంసం సృష్టించిందని అన్నారు. 2,000 కోట్ల మధ్యంతర సాయాన్ని వెంటనే విడుదల చేయాలని ప్రధాని మోదీని కోరారు. దెబ్బతిన్న మౌలిక సదుపాయాలు, జీవనోపాధిని తాత్కాలిక పునరుద్ధరణకు పరిపాలన ద్వారా ఈ మొత్తాన్ని ఉపయోగిస్తామని ఆయన చెప్పారు. ఫెంగల్ తుఫాను గత నెల నవంబర్ 23న అల్పపీడనంగా ఏర్పడి దక్షిణాది రాష్ట్రమైన తమిళనాడులోని 14 జిల్లాల్లో భారీ విధ్వంసం సృష్టించింది. తొలుత తిరువారూరు, తంజావూరు, మైలాడుతురై, నాగపట్నం జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయని ప్రధాని మోదీకి రాసిన లేఖలో సీఎం స్టాలిన్ తెలిపారు. దీంతో పాటు రాజధాని చెన్నై, తిరువళ్లూరు, చెంగల్‌పట్టు, కాంచీపురం, విల్లుపురం తదితర జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఆ తర్వాత డిసెంబర్ 1న ఈ ప్రాంతాల్లో తుపాను తాకడంతో కడలూరు, కళ్లకురిచ్చి, విల్లుపురం, తిరువణ్ణామలైలో రోడ్లు, విద్యుత్ లైన్లకు భారీ నష్టం వాటిల్లింది. గంటకు 90 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయడంతో పలుచోట్ల నేలకొరిగాయి. దీంతో పాటు అంతర్భాగంలోని ధర్మపురి, రాణిపేట, కృష్ణగిరి, వేలూరు, తిరుపత్తూరు జిల్లాల్లో కూడా భారీ వర్షాలు, వరదల వల్ల భారీ నష్టం వాటిల్లింది.

లక్షల కుటుంబాలు విపత్తుల బారిన..

ఈ ప్రకృతి వైపరీత్యం కారణంగా దాదాపు 69 లక్షల కుటుంబాలు, 1.5 కోట్ల మంది ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. సిఎం స్టాలిన్ ప్రకారం, తిరువణ్ణామలై, విల్లుపురం, కళ్లకురిచి జిల్లాల్లో ఒక్క రోజులో మొత్తం సీజన్ సగటు (50 సెం.మీ కంటే ఎక్కువ) కు సమానమైన వర్షపాతం నమోదైంది. దీని కారణంగా ఇక్కడ వరదలు వంటి పరిస్థితి ఏర్పడింది. మౌలిక సదుపాయాలు, పంటలకు భారీ నష్టం జరిగింది. ఈ జిల్లాల్లో సహాయ, సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు సీనియర్ మంత్రులు, అధికారులను నియమించగా, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డిఆర్ఎఫ్) 9 బృందాలు, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డిఆర్ఎఫ్) 9 బృందాలను మోహరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నష్టాలను ప్రాథమికంగా అంచనా వేసినప్పుడు తాత్కాలిక పునరుద్ధరణ ప్రయత్నాలకు దాదాపు రూ.2,475 కోట్లు అవసరమని తేలిందని సీఎం చెప్పారు.

# మరింత పటిష్టంగా నావికాదళం..

# ఇకపై చైనా దుష్టపన్నాగాలకు చెక్!



వృద్ధి రేటులో అగ్రరాజ్యాలను మించి దూసుకెళ్తున్న భారతదేశం తన రక్షణ వ్యవస్థను రోజురోజుకీ పటిష్టం చేసుకుంటోంది. త్రివిధ దళాలను ప్రపంచంలోని అత్యుత్తమ డిఫెన్స్ ఫోర్సెస్‌కు ధీటుగా తయారు చేయాలని ప్రయత్నిస్తోంది. భారత భౌగోళిక సరిహద్దుల్లో ఇప్పటికే కవ్వింపు చర్యలతో దూకుడు ప్రదర్శిస్తున్న చైనా, మరోవైపు సముద్ర జలాల్లోనూ ఇదే వైఖరిని ప్రదర్శిస్తోంది. సముద్ర పరిశోధనల కోసం అంటూ రీసెర్చ్ వెస్సెల్స్ ద్వారా హిందూ మహాసముద్రంలో చైనా నౌకలు భారత్‌పై కన్నేసిన విషయం తెలిసిందే. చైనాను ఎదుర్కోవాలంటే మన శక్తిసామర్థ్యాలను వీలైనంత త్వరగా పెంపొందించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ క్రమంలో తాజాగా రూ. 90,000 కోట్లతో నావికాదళాన్ని మరింత బలోపేతం చేసేందుకు నడుం బిగించింది. ఇందులో భాగంగా ఫ్రాన్స్ నుంచి 26 'రఫేల్ మెరైన్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్'లతో పాటు 3 స్కార్పీన్ సబ్‌మెరీన్స్‌ను కొనుగోలు చేయాలని భావిస్తోంది. నెల రోజుల్లో ఈ ప్రతిపాదనలపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఈ విషయాన్ని నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కే. త్రిపాఠీ వెల్లడించారు. ఈ మేరకు ఫ్రాన్స్‌తో సంప్రదింపులు జరుపుతున్నామని ఆయన తెలిపారు. రఫేల్ మెరైన్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లతో పాటు స్కార్పీన్ రకం సబ్‌మెరీన్లను భారత్‌లోని మజగాం డాక్‌యార్డ్‌లో తయారుచేసే అంశంపై కూడా చర్చిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. ఇప్పటికే 6 స్కార్పీన్ సబ్‌మెరీన్లను డాక్‌యార్డ్ తయారు చేసివ్వగా, వాటి సంఖ్యను పెంచేందుకు మరో 3 సబ్‌మెరీన్లను తయారు చేసే అంశంపై మంతనాలు కొనసాగుతున్నాయి. ఈ రకం సబ్‌మెరీన్లు ఫ్రెంచ్ కంపెనీకి చెందినవే అయినప్పటికీ, ప్రాజెక్ట్ 75లో భాగంగా వీటిని భారత్‌లోనే తయారు చేస్తున్న విషయం తెలిసిందే.

మరో 12 ఏళ్లలో సొంతంగా అణు జలాంతర్గామి

రక్షణ రంగంలో స్వయం సమృద్ధిని సాధించేందుకు ప్రయత్నిస్తున్న భారత్, అప్పటి వరకు రక్షణ అవసరాలు తీర్చేందుకు మిత్రదేశాలతో ఒప్పందాలు చేసుకుని, అధునాతన ఆయుధ సంపత్తిని సమకూర్చుకుంటోంది. కొన్నింటిని నేరుగా ఆయా దేశాల నుంచి కొనుగోలు చేస్తున్నప్పటికీ, మిగతావాటిని భారత్‌లోనే తయారు చేసేలా ఒప్పందాలు చేసుకుంటోంది. అదే సమయంలో అగ్రరాజ్యాలతో పోటీపడే స్థాయిలో స్వదేశీ పరిజ్ఞానాన్ని కూడా అభివృద్ధి చేసుకుంటోంది. ఈ క్రమంలో రానున్న రోజుల్లో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో న్యూక్లియర్ సామర్థ్యం కల్గిన సబ్‌మెరీన్లను తయారుచేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. 2036-37 నాటికి తొలి స్వదేశీ అణు జలాంతర్గామి సిద్ధమవుతుందని, ఆ తర్వాత మరో రెండేళ్లకు 2వ జలాంతర్గామిని సిద్ధం చేస్తామని నావికాదళ అధిపతి వెల్లడించారు. అనేక దశాబ్దాల జాప్యం అనంతరం వీటిని విశాఖపట్నంలోని రహస్య షిప్ బిల్డింగ్ సెంటర్‌లో తయారు చేసేందుకు కేంద్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదం తెలిపింది. మొత్తం 6 అణు జలాంతర్గాములను సిద్ధం చేసుకోవాలన్నది లక్ష్యం. అలాగే రానున్న పదేళ్లలో మొత్తం 95-100 యుద్ధ నౌకలను సిద్ధం చేసి సముద్రంపై ఆధిపత్యాన్ని చాటాలని చూస్తోంది. 1999లో నాటి ఎన్డీఏ ప్రభుత్వం 30 ఏళ్లలో 24 సబ్‌మెరీన్లు (%ూ-75×% మోడల్ డీజిల్-ఎలక్ట్రిక్ రకం) తయారు చేయాలని నిర్ణయించింది. అయితే ఇందులో భాగంగా ఇప్పటి వరకు కల్వరీ క్లాస్‌కి చెందిన 5 సబ్‌మెరీన్లు నావికాదళానికి అందాయి. ఆరవది ప్రస్తుతం ట్రయల్స్ నిర్వహిస్తోంది. సెకండ్ బ్యాచ్ సబ్‌మెరీన్ల నిర్మాణం ఇంకా ప్రారంభం కాలేదు.

అమ్ములపొదిలోకి నెలకొక ఆయుధం..!

నావికాదళపతి అడ్మిరల్ త్రిపాఠీ వెల్లడించిన వివరాల ప్రకారం భారత్‌లోని వివిధ ప్రాంతాల్లో 63 యుద్ధ నౌకల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. మరో 31 యుద్ధ నౌకలకు అనుమతులు మంజూరు కావాల్సి ఉంది. వీటికి తోడుగా కాలం చెల్లిన 60 చేతక్ హెలీకాప్టర్లను తొలగించి, వాటి స్థానంలో అధునాతన హెలీకాప్టర్లను సమకూర్చేందుకు నడుం బిగించింది. అలాగే శత్రువుల కన్నుగప్పు దూసుకెళ్లే రెండు యుద్ధ నౌకలు (%హ్ముశ్రీష్ట్ర ళీతీఱస్త్రఁవం%)లను రష్యన్ షిప్‌యార్డులో నిర్మించగా, వాటిలో మొదటిది 'తుశీల్' వచ్చేవారం నావికాదళంలో చేరనుంది. 2025 మొదటి త్రైమాసికంలో 2వ స్టెల్త్ ఫ్రిగేట్ 'తమాల్' కూడా అందుబాటులోకి రానుంది. మొత్తంగా రానున్న ఏడాది కాలంలో నెలకొక యుద్ధ నౌక నావికాదళం అమ్ముల పొదిలో చేరనుంది.

# 67 గ్రామాల్లో అభివృద్ధి బాట వేయనున్న

# మహా కుంభమేళా జాతర.. సరికొత్త జిల్లా ఏర్పాటు



మహాకుంభమేళా జాతర కొత్త సంవత్సరం 2025 జనవరి 13న ఉత్తర్ ప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో ప్రారంభంకానుంది. ఈ కుంభమేళా నిర్వహణ కోసం ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ 'మహా కుంభమేళా' జిల్లాగా ప్రకటించబడింది. దీనికి సంబంధించి ప్రయాగ్‌రాజ్ డీఎం నోటిఫికేషన్ విడుదల చేశారు. కొత్త జిల్లాకు సంబంధించిన వాహన కోడ్‌ను కూడా విడుదల చేశారు. మొత్తం పరేడ్ ప్రాంతం అలాగే సంగం చుట్టూ ఉన్న నాలుగు తహసీల్‌లకు చెందిన 67 గ్రామాలు ఈ జిల్లాలో ఉన్నాయి. 2019లో 30 గ్రామాలను కలిపి కొత్త జిల్లా ఏర్పాటు చేశారు. ఇప్పుడు 2025 లో జరగనున్న మహాకుంభ మేళాలో మరో 37 గ్రామాలను చేర్చారు. ఈ విధంగా ప్రయాగ్‌రాజ్ డివిజన్‌లో ఇప్పుడు ఐదు జిల్లాలు ఉన్నాయి. మహా కుంభమేళాను కొత్త జిల్లాగా ప్రకటించడంతో ప్రయాగ్‌రాజ్ డివిజన్‌లో ఇప్పుడు ఐదు జిల్లాలు ఉన్నాయి. ప్రయాగ్‌రాజ్, ప్రతాప్‌గఢ్, కౌశాంబి, ఫతేపూర్‌లతో పాటు మహాకుంభమేళా జిల్లా కూడా ఈ డివిజన్‌లో చేర్చబడింది.

కొత్త జిల్లాలో కలిపిన గ్రామాలకు ఎలాంటి ప్రయోజనం ఉంటుంది?

ఈ కొత్త జిల్లాలో అదనపు కలెక్టర్లను నియమించడం ద్వారా అన్ని కేటగిరీల కలెక్టర్ల అధికారాలను పొందనున్నారు. మహాకుంభమేళాకు కేటాయించిన బడ్జెట్‌తో జిల్లా సరిహద్దుల్లోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తామన్నారు. దీనివల్ల ఈ గ్రామాలన్నింటిలో ప్రాథమిక సౌకర్యాలు, పలు నిర్మాణాలు వేగంగా అభివృద్ధి చెందుతాయి. ఈ గ్రామాల్లో మెరుగైన రోడ్లు, నీరు, విద్యుత్, రవాణా వ్యవస్థలు ఏర్పాటు చేయనున్నారు.

రెవెన్యూ గ్రామాలను కొత్త జిల్లాలో కలపనున్నారు

ప్రయాగ్‌రాజ్ జిల్లాలోని 67 రెవెన్యూ గ్రామాలను మహాకుంభమేళా జిల్లాలో చేర్చనున్నారు. వీటిలో ఇబ్రహీంపూర్ కాచర్, ఎఖ్లాస్‌పూర్, రసూల్‌పూర్ ఉపహార్, రసూల్‌పూర్ కాచర్, ఫతేపూర్, చక్ జమాల్, సోనౌటీ, బద్రా, చక్ ఫాత్మా, జమిన్ షెర్దిహ్, పూరే సుర్దార్, జుసీ కోహ్నా, హవేలియా, ఉస్తాపూర్ మహమూదాబాద్ ఉపహార్, ఉస్తాపూర్ మహ్మదాబాద్ క్యాచర్, కాచర్, మహ్మదాబాద్ క్యాచర్ ఉన్నాయి. ఖురేషిపూర్ ఉపర్హార్, ఖురేషిపూర్ కచ్, కిడ్గంజ్ ఉపర్హార్, కిడ్గంజ్ కచర్ , బరాహి పట్టి కచర్లను చేర్చారు. ఇవి మరమే కాదు బామన్ పట్టి కాచర్, ముస్తఫాబా మునకస్మా ఉపహార్, ముస్తఫాబా మునకస్మా కాచర్, అలీ పట్టి, బస్కీ ఉపహార్, బాస్కీ కాచర్, అల్లాపూర్ బస్కీ కాచర్, బద్దద జహురుద్దీన్, కరణ్‌పూర్, బఘడ బాలన్, చక్షర్‌ఖాన్ కాచర్, సాదియాబాద్ ఉపహార్, సాదియాబాద్ ఉపహార్ చాంద్‌పూర్ సలోరి. కాచర్, గోవింద్‌పూర్ ఉపర్హార్, పట్టి చిల్లా ఉపర్హార్, పట్టి చిల్లా కాచర్, ఆరాజీ బరోద్‌ఖానా ఉపర్హార్, ఆరాజీ బరోద్‌ఖానా కచర్‌లు అంటే మొత్తం ఈ 67 గ్రామాలు కొత్త జిల్లలో ఉన్నాయి. మదనువ ఉపహార్, మదనువ కాచర్, మావయ్య ఉపహార్, మావయ్య కాచర్, దేవ్‌రఖ్ ఉపహార్, దేవ్‌రఖ్ కాచర్, ఆరైల్ ఉపహార్, ఆరైల్ కాచర్, చక్ సయ్యద్ అరబ్ దర్వేష్, చక్ అరాజీ ఖాన్ ఆలం, మాధోపూర్ ఉపహార్, మాధోపూర్ కాచర్, జహంగీరాబాద్ ఉపహార్, జహంగీరాబాద్ ఉపహార్, జహంగీరాబాద్ ఉపహర్ , మహేవ పట్టి ఈస్ట్ కాచర్, మహేవ పట్టి వెస్ట్ కాచర్, మీరఖ్‌పూర్ కాచర్, బేలా కాచర్ గన్‌పౌడర్ స్టోర్, పడిలా, మన్సైటా. తహసీల్ ఫుల్‌పూర్.. కొత్త జిల్లాలో బేలా సైలాబీ కచర్, ఔరాహ్ ఉపార్, సిహౌరీ ఉపహార్, సిహౌరీ కచర్, సంపూర్ణ కవాతు కూడా చేర్చనున్నారు.

మహాకుంభమేళా నగర వాహన కోడ్ %ఖూ% 69గా నిర్ణయించబడింది

యుపిలోని 75 జిల్లాల తర్వాత మహాకుంభమేళా నగరం 76వ జిల్లాగా అవతరించింది. ఈ జిల్లాకు చెందిన వాహనాలకు రవాణా శాఖ యుపి 69 కోడ్‌ను జారీ చేస్తుంది. ప్రయాగ్‌రాజ్ వాహనాలపై కోడ్ నంబర్ %ఖూ% 70. రవాణా శాఖ రిజర్వ్ చేసిన కోడ్ నంబర్లలో యుపి నంబర్ 69 మహాకుంభ నగరానికి కేటాయించనున్నారు.

